మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



## జిల్లా అభివృద్ధికి అధికారులు బాధ్యతతో పని చేయాలి..

**వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి,మార్చి 29 (ప్రభాతవార్త):** వన పర్తి పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందా లంటే అధికారులు బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం వనపర్తి పట్టణం లోని కలెక్టర్ ఆఫీస్ పక్కన పార్క్ కొరకు స్థల పరిశీలన, ఎం సిహెచ్ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచాలని అన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసు కోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఈడబ్ల్యూ ఐడీసీ అధికారులను ఆదేశించారు. అలాగే పట్టణంలో నిర్మించే రహదారి పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్ అండ్‌బీ అధికారులను ఆదేశించారు. గాంధీ చౌక్ లో రోడ్ వైడెనింగ్ పని తనిఖీ చేశారు. అలాగే కొత్త ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ సందర్శించి మిగిలిన పనులను పూర్తి చేసి అప్పగించాలని అన్నారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు ఈఈ దేశ్యా నాయక్, దాసయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం..

**-వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ మంత్రి, కలెక్టర్,అధికారులు**



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 29 ప్రభాతవార్త:** ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానున్న 10వ తరగతి పరీక్షలను నాగర్‌కర్నూల్ జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి అయినట్లు జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం మధ్యాహ్నం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ల సబిత ఇంద్రారెడ్డి 10వ తరగతి పరీక్షల నిర్వహణపై ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అడిషనల్ ఎస్పీ రామేశ్వర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో ఈ యేడాది 10572 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాయనున్నారని, పరీక్షల సజావుగా నిర్వహించేందుకు 60 రెగ్యులర్, ఒకటి ప్రైవేటు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో సి కేటగిరిలో 6 పరీక్ష కేంద్రాలు ఉన్నాయని, వాటికి సకాలంలో ప్రశ్న పత్రాలు చేరే విధంగా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఈ సారి 10వ తరగతి పరీక్షలు కేవలం 6 పేపర్లు ఉంటాయని, ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటాయన్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు, పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాట్లు, విద్యార్థులు సకాలంలో చేరుకునే విధంగా రూట్ల వారిగా బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష జరుగుతున్నంత సేపు నిరంతర విద్యుత్ సరఫరా, పోలీస్ బందోబస్తుకు తగిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు అనవసరపు ఆందోళనలకు గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని, ఉదయం 9 గంటల వరకు పరీక్ష కేంద్రానికి చేరుకునే విధంగా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ రామేశ్వర్, డీఈఓ గోవిందరాజులు, డీయం ఆర్‌టీసీ ధర్మసింగ్, పోస్టల్, విద్యుత్, వైద్య శాఖ నుంచి అధికారులు పాల్గొన్నారు.

## సీపీఆర్‌పై అవగాహన ఉండాలి..

**- మహబూబ్‌నగర్ ఎస్పీ నరసింహ**



సీపీఆర్ చేస్తూ అవగాహన కల్పిస్తున్న ఎస్పీ

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మార్చి 29, ప్రభాతవార్త:** ఇటీవల చాలా మంది గుండెపోటుకు గురవుతున్నారని, ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కల్గి ఉండాలని మహబూబ్‌నగర్ ఎస్పీ నరసింహ సూచించారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఈఎంఆర్ఐ, గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిరు వ్యాపారులకు ఆటో డ్రైవర్లకు, పాఠశాల, కళాశాల విద్యార్థులు, స్థానిక ప్రజలకు యాక్సిడెంట్ ఫస్ట్ రెస్పాండర్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సీపీఆర్ పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏదైనా వ్యక్తి యాక్సిడెంట్ , కుక్క, పాము కాటు,యాసిడ్ దాడి లాంటివి జరిగినప్పుడు అపస్మారక స్థితిలో ఎలాంటి ఉలుకు పలుకు లేకుండా ఉంటే ముందుగా అతని వద్దకు వెళ్లి తట్టి లేపడం తన మెడను ఉత్తేజపర్చేలా చేయాలన్నారు. అలా స్పందించకపోతే నాడి పని చేస్తుందా లేదా చూడాలని, పోలీసులకు, అంబులెన్స్‌కు సమాచారం చేరవేయాలని సూచించారు. అంబులెన్స్ వచ్చే వరకు సీపీఆర్ చేయాలన్నారు. ఒక వ్యక్తి ఛాతిపై రెండు ఇంచుల లోతు వరకు ఒత్తిడి తెస్తూ సెకనుకు రెండు సార్లు కంప్రెస్ చేయాలన్నారు. ట్రైనింగ్ కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములు, డీఎస్పీ చంద్రబాబు,సీఐ రాజేశ్వర్‌గౌడ్, ఎస్సై వెంకటేశ్వర్లు, ఈఎంఆర్ఐ సిబ్బంది పాల్గొన్నారు.

## రెండు పడకల గదుల ఇళ్లను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



డబుల్ బెడ్ రూం దరఖాస్తుదారుల ఇండ్లను పరిశీలిస్తున్న దృశ్యం

**గద్వాల ప్రతినిధి, మార్చి 29 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని 34వ వార్డులో జిల్లా అడిషనల్ కలెక్టర్ అపూర్వ్ చౌహాన్ పట్టణంలో గల రెండు పడకల గదుల దరఖాస్తుదారుల లబ్ధిదారులను కలసి ఎలాంటి తప్పిదాలు జరుగాయని అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక టీంలు చొరవ తీసుకుని పారదర్శకంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎవరు కూడా అధైర్యపడవద్దంటూ లబ్ధిదారులకు భరోసా కల్పించారు. వీరివెంట మున్సిపల్ కౌన్సిలర్ బండల పాండు, కమిషనర్ తదితరులు హాజరయ్యారు.

# హైదరాబాద్ మాదిరిగా ...

# గ్రేటర్ మహబూబ్‌నగర్..!

**మహబూబ్‌నగర్‌లో మల్టీప్లెక్స్ థియేటర్, షాపింగ్ కాంప్లెక్స్**

**మూడు నెలల్లో చిన్నదర్పల్లి బైపాస్ రోడ్డు పనులు ప్రారంభం..!**

**రాష్ట్ర ఎక్సైజ్ శాఖమంత్రి డా. శ్రీనివాస్‌గౌడ్ వెల్లడి**



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మార్చి 29 ప్రభాతవార్త :** గ్రేటర్ హైదరాబాద్ మాదిరిగా మహబూబ్‌నగర్‌ను భవిష్యత్తులో గ్రేటర్ మహబూబ్‌నగర్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రజలు, మున్సిపల్ కౌన్సిల్, అధికారులందరూ కలిసి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బుధవారం మహబూబ్‌నగర్ మున్సిపల్ సమావేశ మందిరంలో నిర్వహించిన 2023,24 మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణంలో అన్ని రకాల మౌలిక వసతును ఏర్పాటు చేశామన్నారు. 2014కు పూర్వం పట్టణంలో 7500ల మందికి రూ. 200 పెన్షన్ ఇస్తుండగా, ఇప్పుడు సుమారు 20,000ల మందికి ప్రతినెల 4 కోట్ల 25 లక్షల రూపాయలు పెన్షన్ల రూపేణా ఇస్తున్నామని, 7 సంవత్సరాలలో 407 కోట్ల రూపాయలు పెన్షన్లు ఇచ్చినట్లు తెలిపారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, సిఎంఆర్ఎఫ్, పింఛన్లకు నియోజకవర్గంలో 1000 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి వెల్లడించారు. మహబూబ్‌నగర్ పట్టణం ఇంకా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని, 400ల ఎకరాలలో ఐటి కారిడార్‌ను అభివృద్ధి చేస్తున్నామని, 350 ఎకరాలలో ఫుడ్ పార్క్ ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పుడు పట్టణంలో 150 కోట్ల రూపాయలతో పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని, త్వరలోనే అన్ని వార్డులు పర్యటించి పనులు చేపడతామని, ఇతర శాఖల ద్వారా మరో 200 కోట్ల రూపాయలతో పనులు నడుస్తున్నాయని తెలిపారు. భవిష్యత్తులో మహబూబ్‌నగర్‌ను గ్రేట్ హైదరాబాద్ మాదిరిగా గ్రేటర్ మహబూబ్‌నగర్‌గా తీర్చిదిద్దే ప్రణాళిక ఉన్నట్లు మంత్రి వెల్లడించారు. పట్టణం మరింత అభివృద్ధి చెందితే అలాగే ఐటి కారిడార్‌లో అన్ని పరిశ్రమలు వస్తే ఆస్తిపన్ను రూపేణా వంద నుండి 200ల కోట్లరూపాయలు మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఐటి కారిడార్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద లిథియం సెల్ టెక్నాలజీని ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనున్నామని, దీనికి అందరు సహకరించాలని దీని ద్వారా 40 వేల మందికి ఉద్యోగాలొస్తాయన్నారు. పట్టణంలో 500 కోట్ల రూపాయలతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మిస్తున్నామని, జంక్షన్ల అభివృద్ధి జరుగుతున్నదని అన్నారు. త్వరలోనే పార్కులు, రహదారుల నిర్వహణను ముడాకు అప్పగించనున్నామని తెలిపారు. మహబూబ్‌నగర్ పట్టణం నడిబొడ్డున త్వరలోనే మల్టీప్లెక్స్ థియేటర్‌తో పాటు షాపింగ్‌మాల్ రహదారి పనులు 3 నెలల్లో ప్రారంభిస్తామని, చిన్నదర్పల్లి, బోయపల్లి మీదుగా మహబూబ్‌నగర్, జడ్చర్ల రహదారి కలిసే విధంగా మరో రహారిని నిర్మిస్తామన్నారు. కళాభారతి, వెజ్‌నాన్ వెజ్ మార్కెట్, స్లాటర్ హౌస్ పనులు వేగవంతం చేయాలన్నారు. కలెక్టర్ జి. రవినాయక్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని కోరారు. అంతకు ముందు మున్సిపల్ ఛైర్మన్ కెసి నరసింహులు, 2023,24 సంవత్సరానికి సంబంధించి 46 కోట్ల 12 లక్షల రూపాయల అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇందులో పన్నుల రూపేణా 27 కోట్ల 30 లక్షలు, పన్నేతర రూపేణా 17.92లక్షల రూపాయలు, 2022,23 ఆర్థిక సంవత్సరం మిగులు 89.61 లక్షలుగా అంచనా బడ్జెట్ రూపొందించడం జరిగింది. కాగా 2023,24లో 45 కోట్లు అంచనా వ్యయంగా పేర్కొనడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ కెసి నర్సింహులు మాట్లాడుతూ మహబూబ్‌నగర్ మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలని కోరారు.మున్సిపల్‌లో వైస్ ఛైర్మన్ గణేష్, ఇంఛార్జి మున్సిపల్ కమిషనర్ శంకర్‌సింగ్ నాయక్ మాట్లాడారు.కాగా కౌన్సిలర్ అంజయ్య మాట్లాడుతూ వీరన్నపేట డంపింగ్ యార్డు నుండి వస్తున్న పొగవల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. షాపుల నుండి వచ్చే ఆదాయాన్ని టెండర్ ప్రకారం వసూలు చేయాలని అన్నారు. స్థానిక సంస్థలు, రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. సీతారామరావు, మున్సిపల్ ఇంజనీర్లు, కౌన్సిలర్ తదితరులు సమావేశానికి హాజరయ్యారు.

## విపక్షాల కుట్రలను తిప్పి కొట్టాలి..

**-ఆత్మీయ సమ్మేళనంలో జెడ్పీ చైర్మన్ శాంతకుమారి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్**



ఆత్మీయ సమ్మేళనానికి ర్యాలీగా వస్తున్న నాయకులు



ఆత్మీయ సమ్మేళనానికి ర్యాలీగా వస్తున్న నాయకులు

**కల్వకుర్తి,మార్చి29 ప్రభాతవార్త:** విపక్షాల కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకొని పోవాలని జెడ్పీ చైర్మన్ శాంతకుమారి, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌లు పిలుపునిచ్చారు. 9ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అద్భుత విజయాలు సాధించిందని, వచ్చే ఎన్నికల్లో మారోమారు బీఆర్ఎస్ అధికారం చేపట్టి హ్యాట్రిక్ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆత్మీయ సమ్మేళనాకి తోటపల్లి, ఎల్లికట్ట, బెక్కర, గుండూర్, వెంకటాపూర్, వెంకటాపూర్ తాండ, జీడిపల్లి, జీడిపల్లి తాండ, సుద్దకల్, కుర్మిద్ద గ్రామాలను కలుపుకొని వేపూర్ కేంద్రంగా బుధవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనంను అట్టహాసంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ శాంతకుమారి, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యంలు ముఖ్య అతిథిగా హజరై బీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరించి గ్రామంలో డప్పు వాయిద్యాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకొని దేశంలోని నిరంకుశ, దుర్మార్గ పాలన కొనసాగిస్తుందని మండిపడ్డారు. కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, వాటిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సామ మనోహర చెన్నకేశవ, వైస్ ఎంపీపీ గోవర్ధన్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు విజయ్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి, వెల్దండ జెడ్పీటీసీ విజితారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

**మృతుడి కుటుంబానికి పరామర్శ...**

కల్వకుర్తి మండలం వేపూర్ గ్రామానికి చెందిన దుడ్డు లింగయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి మృతుడి కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సహయం అందించి కుటుంబానికి భరోసా కల్పించారు. బీఆర్ఎస్ పార్టీ పరంగా మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. అదే విధంగా గుండూర్ గ్రామంలో మృతి చెందిన నంబీ ముసలయ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## అర్హుల ఎంపికే లక్ష్యంగా ..

**● కావేరమ్మపేటలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆకస్మిక పర్యటన**

**● పారదర్శకంగా డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తాం : ఎమ్మెల్యే**



కావేరమ్మపేటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మార్చి 29, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డబుల్ బెడ్రూం ఇండ్ల పథకానికి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం ఎమ్మెల్యే కావేరమ్మపేటలో ఆకస్మిక పర్యటించారు. లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఇంటింటికీ తిరుగుతూ కుటుంబ ఆర్థిక పరిస్థితి, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండను సైతం లెక్క చేయకుండా పర్యటన కొనసాగించారు. కావేరమ్మపేటలో పంపిణీకి సిద్ధంగా ఉన్న 120 ఇండ్లకు సంబంధించి బుధవారం స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ లబ్ధిదారులను ఎంపిక చేశారు. అదేవిధంగా పట్టణంలో వివిధ నిర్మాణ దశల్లో ఉన్న 1400 ఇండ్ల నిర్మాణాలు కూడా త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక విషయంలో తానే స్వయంగా దరఖాస్తులను పరిశీలించి పారదర్శకంగా పైరవీలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మిరవీందర్, నాయకులు బీకేఆర్, తాసిల్దార్ లక్ష్మినారాయణ పాల్గొన్నారు.



ఇంటింటికీ తిరుగుతూ సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

## రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తాం..

**హాత్ సే హాత్ జోడోయాత్రలో మాజీ మంత్రి డా.జి.చిన్నారెడ్డి..**



హాత్ సే హాత్ జోడో యాత్రలో పాల్గొన్న మాజీ మంత్రి చిన్నారెడ్డి

**ఖిల్లాఘణపురం,మార్చి 29 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పర్వతాపురం, సల్కెలపురం తాండా, అప్పరెడ్డిపల్లి, మల్కిమాయిన్‌పల్లి తాండాలు, అల్లమాయిపల్లి, మామిడిమాడ గ్రామాల్లో బుధవారం హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన యాత్రకు ముఖ్య అతిథిగా మాజీ మంత్రి డా.జి.చిన్నారెడ్డి హాజరై ప్రచారం చేస్తూ ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రైతు డిక్లరేషన్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గ్యాస్ సిలిండర్లకు రూ.500, ఏకకాలంలో రూ.2లక్షల రైతు రుణమాఫీ, భూమి ఉన్న రైతులతో పాటు కౌలు రైతులకు కూడా ఏడాదికి రూ.15వేలు ఇస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. అనంతరం సల్కెలపురం, ఇతర గ్రామాల్లో ఆయన పర్యటించి ఇల్లు ఇల్లు తిరుగుతూ ప్రతి ఒక్కరిని పలకరించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో పేదలకు అభివృద్ధి ఫలాలు, బీఆర్ఎస్ పార్టీ హయాంలో ప్రస్తుతం చేస్తున్న అవినీతి అరాచకాలకు పాల్పడుతుందని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోని ప్రతి గ్రామంలోని నిరుపేదలకు ఇండ్లు నిర్మించామని, కేసీఆర్ కుటుంబం అవినీతి పాలనలో కురుకుపోయిందని, ఎమ్మెల్యేలు, మంత్రులు అవినీతికి పాల్పడి కోట్ల రూపాయాలు సంపాదించి పెట్టుకున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీ కి ఓటు వేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వికలాంగుల కమిటీ అధ్యక్షుడు గంజాయి రమేష్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు రోహిత్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దేవిజా నాయక్, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య యాదవ్, ఎంపీటీసీ మల్లేష్ యాదవ్, జిల్లెల ప్రవీణ్ కుమార్ రెడ్డి, క్యామ బాలరాజు, దిలీప్ కుమార్ యాదవ్, బాలరాజు యాదవ్, బి.నరసింహా, డా.నరేందర్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, సంజీవరెడ్డి, పర్వతాపురం సునీల్ రెడ్డి, మహేందర్, పురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి..

**రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి**

**విడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ఎస్పీ

**గద్వాల ప్రతినిధి,మార్చి 29 ప్రభాతవార్త :** రాష్ట్రంలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సజావుగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి జిల్లా కలెక్టర్‌లను, సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం హైద్రాబాద్ నుండి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, విద్యాశాఖ సెక్రెటరీ వాకాటి కరుణ, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దేవసేనతో కలిసి పదవ తరగతి పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలను అధికారులు విజయవంతంగా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. ఏప్రిల్ 3 నుండి ఏప్రిల్ 13 వరకు జరిగే పదవ తరగతి పరీక్షల నిర్వహణకు జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌లను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల 90 వేల మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరవుతారని, దాదాపు 2 వేల 600లకు పైగా కేంద్రాల్లో పరీక్షలను నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. 10వ తరగతి పరీక్షల్లో గతంలో ఉన్న 11 పేపర్లను ప్రస్తుతం 6 పేపర్లుగా కుదించామని, దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద తప్పనిసరిగా ఎఎన్ఎం అందుబాటులో ఉండాలని మంత్రి పేర్కొన్నారు. పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు రవాణా కోసం ప్రత్యేక ఆర్టీసి బస్సులు ఉదయం, మధ్యాహ్నం నడపాలని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అధిక శ్రద్ధ వహించాలని మంత్రి ఆదేశించారు. కలెక్టర్లు రవాణా, పోలీస్, రెవెన్యూ, వైద్య శాఖల అధికారులు, అప్రమత్తంగా ఉండే విధంగా వారికి సూచనలు జారీ చేయాలని అన్నారు.వేసవి కాలంలో పరీక్షలు నిర్వహిస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. 10వ తరగతి పరీక్షా కేంద్రాలకు ఎవరు సెల్‌ఫోన్ తీసుకుని వెళ్లడానికి వీలు లేదని స్పష్టం చేశారు. పరీక్షల సమయంలో విద్యార్థులు అధికంగా మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉందని విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్‌కోర్సు, సైన్స్ మినహాయించి ప్రతి పరీక్ష ఉదయం 9.30 గం.ల నుండి 12.30 జరుగుతాయని, ఫస్ట్ లాంగ్వేజ్ కాంపొజిట్ కోర్సు, సైన్స్ పరీక్షలు 9.30 గం.లనుండి 12.50 వరకు జరుగుతుందని దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్‌లకు సూచించారు. జిల్లా కలెక్టర్ వల్లూరుక్రాంతి మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాలో 7370 మంది 10వ తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని 41 కేంద్రాలు ఏర్పాటు చేశామని, పోలీస్ స్టేషన్‌కు దూరంలో ఉన్న 13 పరీక్షా కేంద్రాలకు ప్రశ్నా పత్రాల తరలింపు కోసం 9 రూట్లను గుర్తించామని తెలిపారు. 41 సిట్టింగ్ స్క్వాడ్, 2 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించాలని, సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా ఎస్పీ సృజన మాట్లాడుతూ జిల్లాలో జరిగే పదవ తరగతి పరీక్షల నిర్వహణకు 41 సెంటర్లలో పూర్తిస్థాయి బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ప్రశ్నా పత్రాల తరలింపుకు ఎస్కార్ట్ ఏర్పాటు చేస్తామని, ప్రైవేట్, ప్రభుత్వ సెంటర్లలో అన్ని జాగ్రతలు తీసుకుంటామని తెలిపారు. విడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుండి డిఇఓ సిరాజుద్దిన్, శ్రీనివాస్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి శశికళ, ఆర్టీసి దేవేందర్‌గౌడ్, డిపిఓ శ్యాంసుందర్, ఆర్టీఓ పురుషోత్తంరెడ్డి, ఫైర్ అధికారి శ్రీదాసు, సి సెక్షన్ సూపరింటెండెంట్ వరలక్ష్మి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో అందరు భాగస్వాములు కావాలి..



మున్సినల్ బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**కొత్తకోట,మార్చి 29 ప్రభాతవార్త:** మనకు పదవి ఇచ్చి 5ఏళ్ల ప్రజల బాగోగులు చూడాల్సిన బాద్యత మనపై ఉందని అందుకు ఉన్న స్థానం నుండి ఉన్నత స్థానానికి ఎదగాలని ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని వివిధ కుల సంఘాలకు కమ్యూనిటీ నిర్మాణం కోసం భూమిపూజ నిర్వహించి మున్సిపల్ కార్యాలయంలో బడ్జెట్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రజల సమస్యలను వార్డు సభ్యులు తెలుసుకొని ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా కృషి చేయాలని, సమాజానికి మంచి పనులు చేస్తేనే మన జీవిత కాలంలో వారు మనల్ని గుర్తించుకుంటారని అన్నారు. అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని ప్రజలతో ఎంత ప్రేమగా ఉంటే మరో 5ఏళ్లు పదవిలో ఉంటామని అన్నారు. పట్టణంలోని మూడు సీసీ రోడ్లు మంజూరు అయ్యాయని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఉండడం వల్లే సాధ్యమైందని అన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ పట్టణంలో త్రాగునీరు, పరిశుభ్రత పై దృష్టి సారించాలని, వచ్చే సీజన్ కు మొక్కలను విరివిగా నాటి వాటిని కాపాడాల్సిన బాద్యతి ప్రతి వార్డు సభ్యుడి పై ఉందని అన్నారు. పదవిలో ఉన్నప్పుడు ప్రజలకు ఎంత సేవ చేస్తే మనల్ని జీవితాలం గుర్తుంచుకుంటారని అన్నారు. క్రిందస్థాయి నుండి ఎప్పుడు కష్టపడే మనస్థత్వం కలిగి ఉండాలని అన్నారు. పట్టణానికి సంబందించి 8మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, ఏడుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుకేశిని, ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మెన్ చెన్నకేశవ రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ జయమ్మ, సింగిల్విండో చైర్మెన్ వాసుదేవా రెడ్డి, మాజీ జడ్పీటీసీ విశ్వేశ్వర్, ఉమ్మడి జిల్లాల అధికార ప్రతినిధి ప్రశాంత్, కౌన్సిలర్లు కొండారెడ్డి, రాములు యాదవ్, సంధ్య రవీందర్ రెడ్డి, పద్మ అయ్యన్న, తిరుపతయ్య, రామ్మోహన్ రెడ్డి, మిసేక్, సుజాత, వహీద్, బాలకృష్ణ, బీంరెడ్డి, కొండారెడ్డి, నాగరాజు, అస్కని శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

## 10వ తరగతి పరీక్షల్లో కేటాయించిన అదనపు సమయాన్ని విద్యార్థులు గమనించాలి

**నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 29 ప్రభాతవార్త:** 2023 ఏప్రిల్ 3 నుంచి 10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు మొదటి సబ్జెక్టు మరియు సైన్స్ పరీక్ష పేపర్లకు కేటాయించిన అదనపు సమయాన్ని, పరీక్షల వివరాలను విద్యార్థులు గమనించాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ తెలిపారు. ఏప్రిల్ 3వ తేదీన ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్, 4వ తేదీన సెకండ్ లాంగ్వేజ్, 3వ తేదీన థర్డ్ లాంగ్వేజ్, 8న మ్యాథ్స్, 10న సైన్స్, 11న సోషల్ స్టడీస్ పరీక్షలను షెడ్యూల్ వారిగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఒక్కో సబ్జెక్టులో పరీక్షలకు 80 మార్కులు, ఫార్మెటిట్ అసిస్‌మెంట్‌కు 20 మార్కులు ఉంటాయన్నారు. సైన్స్ పేపర్‌లో ఫిజిక్స్, బయోలాజీకి సగం చొప్పున మార్కులను ఇచ్చేలా కొత్త విద్యా విధానాన్ని రూపొందించినట్లు కలెక్టర్ చెప్పారు. అన్ని సబ్జెక్టులకు పరీక్ష సమయం 3 గంటలు ఉండగా కాంపొజిట్ తెలుగు, సైన్స్ పరీక్షలకు అదనంగా 20 నిముషాల పాటు సమయం కేటాయించినట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఆయా పరీక్షల అదనపు సమయాలను 10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు సద్వినియోగం చేసుకొని పరీక్షలను విజయవంతంగా రాయాలని, అదే విధంగా ఇన్విజిలేటర్లు సైతం మార్పును గమనించాలని కలెక్టర్ తెలిపారు.

## ఉన్నత స్థాయికి ఎదగాలి... ఆదర్శంగా ఉండాలి



**వెల్దండ, మార్చి 29 ప్రభాతవార్త:** ఆర్థిక స్థోమతను అధిగమించి క్రమశిక్షణతో చదివి లక్ష్యాన్ని సాధించే దిశగా ప్రయాణించి ప్రతి ఒక్కరు ఉన్నత స్థాయికి ఎదగాలని మాదిగల మండల ఐక్య వేదిక అధ్యక్షులు మీసాల అంజయ్య అన్నారు. వెల్దండ మండలం గొల్లోనిపల్లి గ్రామానికి చెందిన యువశాస్త్రవేత్త మైక్రోబయాలజీ పరిశోధకుడిగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా బంగారు పతాకం, ప్రశంసాలు అందుకున్న దూళ్ల సందీప్‌ను మాదిగల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ వెనుకబడి ఉన్నత విద్యకు దూరమైన మాదిగ విద్యార్థులకు ఉన్నత స్థాయిలో పనిచేస్తున్న విద్యావంతులు, మేధావులు, ఉద్యోగస్తులు, రాజకీయ ప్రముఖులు అండగా నిలువాలని కోరారు. ఎందరో దళిత బిడ్డలు సరైన అవకాశాలు, ప్రొత్సాహం ఆదరణ అందక ఉన్నత విద్యకు దూరమవుతున్నారని వాపోయారు. వారందరిని ప్రొత్సహిస్తే మరింతగా రానిస్తారని తెలిపారు. కార్యక్రమంలో గుద్దటి ప్రభాకర్, టి.శేఖర్, రాజు, శేఖర్, అంజయ్య, అశోక్, పెద్దయ్య, బాలరాజు, నారాయణతో పాటు తదితరులు ఉన్నారు.

## అంబేద్కర్ విగ్రహ విధ్వంసకారులను అరెస్టు చేయాలి



**కోయిల్‌కొండ, మార్చి 29 ప్రభాతవార్త :** అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం మండల కేంద్రమైన కోయిలకొండలో స్వామి వివేకానంద చౌరస్తా ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహ విధ్వంసానికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నేతలు మాట్లాడుతూ రాజ్యాంగ రచయిత డా.బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి పూనుకున్న వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా సంఘం నాయకుడు మంత్రి నరసింహయ్య, నారాయణపేట బిఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి బి. శ్రీనివాస్, మండల దళిత సంఘం నేతలు మొగులయ్య, రమేష్, అనిల్, ఆనంద్, వింజమూరు రమేష్, శ్రీనివాసులు, ఆంజనేయులు, నగేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత చదువుల చదివి తల్లిదండ్రులకు పేరు తేవాలి..

**వైఎస్‌ఆర్ తెలంగాణపార్టీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు మందడి సరోజ్ రెడ్డి**




**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మార్చి 29, ప్రభాతవార్త :** పదో తరగతి విద్యార్థి దశలో చాలా కీలకమని, బాగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జి, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు మందడి సరోజ్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. ఈమేరకు భూత్పూర్ మండలంలో పలు గ్రామాల్లో పదో తరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తన సొంత ఖర్చుతో బుధవారం పరీక్షల ప్యాడ్లు పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు తనవంతు సాయం చేస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా భూత్పూర్ మండలంలోని వెల్కిచర్ల, కొత్త మొల్గర గ్రామాల్లో ప్యాడ్లు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మొల్గర జహంగీర్, గడ్డం యాద య్య, రఘురెడ్డి, అభిషేక్ యాదవ్‌చ, క్రాటావత్ ఆనంద్‌నాయక్ యాదగిరి, భాస్కర్, ఆంజనే యులు, ఆదిల్ పాల్గొన్నారు.

## బిజెవైఎం ఆధ్వర్యంలో సీఎం కెసిఆర్ దిష్టిబొమ్మ దగ్ధం



**మూసపేట, మార్చి 29 ప్రభాతవార్త :** మూసాపేట మండల పరిధిలోని వేముల స్టేజన 44వ జాతీయ రహదారిపై బిజెవైఎం మండల అధ్యక్షుడు విష్ణు ఆధ్వర్యంలో బుధవారం ముఖ్యమంత్రి కెసిఆర్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈసందర్భంగా బిజెవైఎం మండల అధ్యక్షుడు విష్ణు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీక్ అవ్వడం వల్ల చదువుకున్న ఎంతో మంది నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే పేపర్ లీక్ అయిందని ఎన్ని రోజులు ప్రజలను, విద్యార్థులను మోసం చేస్తారని ఇప్పటికైనా పరీక్ష రాసిన అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల బిజెవైఎం అధ్యక్షులు విష్ణు, జిఎస్ ప్రవీణ్‌చారి, హరీష్, ఉపాధ్యక్షులు హరీష్, లక్ష్మణ్, మహేష్, కార్యదర్శి రోహిత్ నాయుడు, చెన్నయ్య, కార్తీక్, ప్రసాద్, లక్ష్మణ్, శేఖర్ పాల్గొన్నారు.

## విజయవంతంగా కొనసాగుతున్న ఉచిత కంటి వెలుగు..

**షాబాద్‌లో కంటి వెలుగును ప్రారంభించిన డాక్టర్, ప్రజాప్రతినిధులు**



**ఇటిక్యాల, మార్చి 29 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కెసిఆర్ అంధత్వం లేని రాష్ట్రంగా తయారు చేసేందుకు రెండవ విడత ఉచిత కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తుందని కళ్లద్దాలు అవసరమైన వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేస్తున్నట్లు ఈ కార్యక్రమాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రాజమ్మ, ఎంపిటిసి తిరుపతి రెడ్డి గ్రామ ప్రజలకు వివరించారు. బుధవారం మండల పరిధిలోని షాబాద్ గ్రామ పంచాయతీలో రైతు వేదికలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ రాజమ్మ, ఎంపిటిసి తిరుపతిరెడ్డితో కలిసి కంటి వెలుగు డా. జ్ఞాని వెంకటరాజన్ ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచ్ రాజమ్మ, ఎంపిటిసి తిరుపిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గ్రామంలో ఉచిత కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తుందని 18 ఏళ్లు పైబడిన వారందరు తమ ఆధార్ కార్డును వెంట తెచ్చుకుని కంటి పరీక్షలు నిర్వహించుకోవాలని అవసరమైన వారికి కంటి పరీక్షల అనంతరం అర్హులైన వారికి ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేస్తారని ఈ అవకాశాన్ని గ్రామంలోని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వారు గ్రామస్తులను కోరారు. ఈ విధంగా జనవరి 15న ప్రారంభమైన ప్రభుత్వ ఉచిత కంటి వెలుగు కార్యక్రమం మండలంలో 8 గ్రామ పంచాయతీలలో ఉచిత కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించి విజయవంతంగా పూర్తిచేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివకుమార్, ఆప్తాలమిస్ట్ మహేష్, డాటా ఎంట్రీ ఆపరేటర్ యువరాజు, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రనాగమ్మ, ఎఎన్‌ఎం విద్యావతి, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి గ్రామ పంచాయతీ సహకారం అభినందనీయం



**ఉట్కూర్, మార్చి 29 ప్రభాతవార్త :** మండల పరధిలోని కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలకు పంచాయతీ తరపున పాఠశాలకు పలు రకాలుగా సహకారం అందిస్తూ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు పాఠశాల యాజమాన్యం తరపున గ్రామ పంచాయతీ గ్రామ సర్పంచ్ శాంతమ్మ, సెక్రెటరీ సాయినాథ్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్, ఉపాధ్యాయురాలు శ్వేత, పాఠశాల ఛైర్మన్ చిన్న నర్సింలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలి..

**- ప్రభుత్వాసుపత్రికి మెరుగైన వసతుల కల్పనకు కృషి...- జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 29 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వాసుపత్రికి అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు అన్ని విధాల కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం ఉదయం ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన కలెక్టర్ అక్కడ వైద్య సిబ్బంది, ఆసుపత్రికి వచ్చే రోగులకు కలుగుతున్న అసౌకర్యాలపై ఆరా తీశారు. దాదాపు 2 గంటల పాటు ఆసుపత్రి మొత్తం కలియ తిరుగుతూ ప్రభుత్వాసుపత్రిని మెడికల్ కళాశాలకు అప్పగించినందున రోగులకు అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి కానీ ఆసుపత్రి భవనంలో ఇంకా కొన్ని విభాగాలకు సరైన వసతులు లేవనే విషయాన్ని కలెక్టర్ గమనించారు. ముఖ్యంగా ప్రతి సోమవారం, బుధవారం గర్భిణీలు ఏఎన్‌సి చెకప్‌కు అధిక సంఖ్యలో రావడం, లేబొరేటరీ పరీక్షలు, ప్రసవాల సంఖ్య పెరగడం, క్యాజువాలిటీ, ఎమర్జెన్సీ వార్డుల్లో సరైన రోగుల సంఖ్య పెరగడంతో స్థలభావం వంటిని పరిశీలించారు. ఆర్‌ఎంఓలు, స్టాఫ్ నర్సులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సరిపడ నర్సింగ్ స్టేషన్లు లేవని, డ్రెస్ మార్చుకునే గదులు, నర్సింగ్ కౌంటర్లు ఏర్పాటు చేయాల్సి ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. చిన్న పిల్లలకు టీకాలు ఇచ్చే ముందు భాగంలోనే ఎక్సరే రూం ఉండటం ఇబ్బందికరమని, ఎక్సరే గది మార్చేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. అదే విధంగా ఎన్ని కౌంటర్లు అవసరం ఉన్నాయి, నర్సింగ్ సెంటర్లు ఎన్ని ఎక్కడెక్కడ నిర్వహించాలి, ఎన్ని బీరువాలు కావాలనే పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. ఆసుపత్రికి తూర్పున ఉన్న ఖాళీ స్థలంలో మురికిగా ఏర్పడి పందులు విహరిస్తున్న అంశాన్ని గ్రహించిన ఆయన మున్సిపల్ సిబ్బందిని పిలిపించి వెంటనే ఏరియా మొత్తం శుభ్రం చేసి పైన గ్రీన్ మ్యాట్ వేయాలని, అక్కడ వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలంగా ఉపయోగించుకోవాలన్నారు. ముందు భాగంలో వాహనాలు పార్కింగ్ చేయకుండా చూడాలన్నారు. అవసరమైన వైద్య సిబ్బందిని సైతం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వచ్చే రోగులకు మాత్రం పూర్తి స్థాయిలో మెరుగైన వైద్యం అందించే విధంగా కృషి చేయాలని వైద్య సిబ్బందిని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యనారాయణ, డీసీహెచ్ డాక్టర్ రమేష్‌చంద్ర, ఆర్‌ఎంఓలు డాక్టర్ దశరథం, బలరాం, అజీమ్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఆసుపత్రుల్లో వార్డులను పరిశీలిస్తున్న దృశ్యం



ఆసుపత్రి తూర్పుభాగంలోని మురికిని తొలగించాలని ఆదేశిస్తున్న కలెక్టర్

# సుంకిరెడ్డి రాకతో దేవాలయాలకు మహర్దశ..

**భైరాపూర్ పెద్దమ్మ దేవాలయానికి రూ.2లక్షల విరాళం**

**వెల్దండ, మార్చి 29 ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన దేవాలయాల నిర్మాణానికి సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి రాకతో దేవాలయాలాభివృద్ధికి మహర్దశ చేకూరింది. వెల్దండ మండలం భైరాపూర్ గ్రామంలో వెలిసిన పెద్దమ్మ తల్లి దేవాలయాభివృద్ధికి అన్ని విధాల సహకరించి రూ.2లక్షలు అందిస్తానని గతంలో ఇచ్చిన హామీ మేరకు రాఘవేందర్‌రెడ్డి ఆలయ నిర్వాహకులకు రూ.2లక్షల చెక్కును ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్, ఎన్‌ఆర్‌ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అందించారు. ఆలయ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొని రావాలన్నారు.

**బాధితురాలికి ఆర్థిక సహాయం..** శంకర్‌కొండ తాండ గ్రామ పంచాయతీలో సంద్రల గడ్డ తాండకు చెందిన రుక్కి గత కొన్ని రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఇటీవల ప్రమాదవశాత్తు కాలు విరిగి ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటుంది. విషయం తెలుసుకున్న ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ ఎన్‌ఆర్‌ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన రూ.5వేల ఆర్థిక సహాయాన్ని గ్రామస్తులు అందించారు. కార్యక్రమంలో పెద్దమ్మ గుడి ఛైర్మన్ మల్లేష్‌యాదవ్, నాయకులు జగన్, సురేష్, రాజుయాదవ్, కట్ల వెంకటేష్, నిరంజన్, శ్రీనుతో పాటు గ్రామస్తులు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.



ఆలయాభివృద్ధికి విరాళం అందజేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

# చిన్నరాజమూర్‌లో శ్రీ రామనవమి వేడుకలు ప్రారంభం..

**-వైభవంగా ధ్వజారోహణం -నేడు సీతారాముల కళ్యాణమహోత్సవం**



**దేవరకద్ర, మార్చి 29 ప్రభాతవార్త:** జిల్లాలోని ప్రధాన దేవాలయాలలో ఒకటైన దేవరకద్ర మండలం చిన్నరాజమూర్ శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏడాది ఈ వేడుకలను అత్యంథ ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తున్నారు. వేడుకల మొదటి రోజు స్వామి వారి సన్నిధిలో ధ్వజారోహణం పూజా కార్యక్రమంతో వేడుకలకు శ్రీకారం చుట్టారు. అలాగే స్వస్తిపుణ్యాహవచనం, పూజ, ఎదుర్కోళ్ళు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మెన్ ఆర్.గోపాలచారి, వ్యవస్థాపక అర్చకులు భీమాచారి, రామాచారి, రాఘవేంద్రాచారి, హనుమేస్‌చారి, పరిమళాచారి, మేనేజర్ ప్రసాద్‌లతో పాటు భక్తులు పాల్గొన్నారు.

**నేడు సీతారాముల కళ్యాణమహోత్సవం..** చిన్నరాజమూర్ శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. దేవస్తానం ముందు వేసిన ప్రత్యేక మండపంలో ఈ వేడుకను నిర్వహిస్తారు. ఈ వేడుకకు జిల్లా నలుమూలల నుండి భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారు. అలాగే సుప్రభాతం, స్వామివారి అలంకరణ, పునర్వసు నక్షత్రం సందర్భంగా తలంబ్రాలు, సీతారామస్వామి రథోత్సవం, ప్రత్యేక భజనలు, తీర్థప్రసాద వితరణ తదతర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అలాగే స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఛైర్మెన్ ఆర్.గోపాలచారి, వ్యవస్థాపక అర్చకులు భీమాచారి, రామాచారి, రాఘవేంద్రా చారి, హనుమేస్‌చారి, పరిమళాచారిలు తెలిపారు.

# గ్రామాలను అభివృద్ధి చేసిన ఘనత కెసిఆర్‌దే..

**సిసి రోడ్డుకు శంకుస్థాపన చేసిన సర్పంచ్ ప్రతాప్**

**మల్దకల్, మార్చి 29 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారం చేపట్టిన కెసిఆర్ నేతృత్వంలోనే టిఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాలకు పెద్దపీట వేసి పట్టణాలతో సమానంగా గ్రామాలను అభివృద్ధి చేయడం జరుగుతుందని సర్పంచ్ ప్రతాప్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని శేషంపల్లి గ్రామంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి నిధుల కింద 6 లక్షల 50 వేలతో నిర్మించనున్న సిసిరోడ్డు పనులను మల్దకల్ సింగిల్ విండో ఛైర్మన్ తిమ్మారెడ్డి సహాయ సహకారాలతో గ్రామ పెద్దలతో కలిసి సిసిరోడ్డు పనులను సర్పంచ్ ప్రతాప్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెపల్లెకు బిఆర్‌ఎస్ గడప గపడకు కెసిఆర్ సంక్షేమ పథకాల కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే గ్రామాలలో డంపింగ్‌యార్డులు, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, వైకుంఠధామాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా రైతుబంధు, రైతుభీమా, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా, కళ్యాణలక్ష్మి, కెసిఆర్ కిట్టు, సీఎం సహాయ నిధి లాంటి సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరుతుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పార్వతమ్మ, పి. లక్ష్మిరెడ్డి, ఎస్. బ్రహ్మానందరెడ్డి, పి. శేషిరెడ్డి, పి. హనుమంతు, నరసింహులు, గుర్రం నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

# సబ్బండ వర్గాల ఆత్మగౌరవం కోసమే పాదయాత్ర..

**నడిగడ్డ ఆత్మగౌరవ పాదయాత్రలో గొంగళ్ల రంజిత్‌కుమార్**



పాదయాత్రలో పాల్గొన్న మహిళలు



రంజిత్‌కుమార్‌కు వీరతిలకం దిద్దుతున్న దృశ్యం

**ధరూర్, మార్చి 29 ప్రభాతవార్త :** మండల పరిధిలో 13వ రోజు ఆత్మగౌరవం నిలబెట్టుకోవడం కోసం నడిగడ్డ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవడం కోసమే నడిగడ్డ ఆత్మగౌరవ పాదయాత్ర ప్రారంభించడం జరిగిందని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా ఛైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్ అన్నారు. 13వ రోజు ధరూర్ మండలంలోని పార్చర్ల, సోంపురం, మన్నాపురం, ధరూర్, బూరెడ్డిపల్లి, ఓబుల్లోనిపల్లి, మార్లబీడు, ర్యాలంపాడు గ్రామాల మీదుగా ఆత్మగౌరవ పాదయాత్ర కొనసాగింది. మన్నాపురం, ధరూర్, బూరెడ్డిపల్లి, మార్లబీడు, ర్యాలంపాడు గ్రామాలలో గ్రామ ప్రజలు గొంగళ్ల రంజిత్‌కుమార్‌కు వీర తిలకం దిద్ది పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సబ్బండ వర్గాల ఆత్మగౌరవం కోసమే నడిగడ్డ ఆత్మగౌరవ పాదయాత్రను కొనసాగించడం జరిగిందని, ఈ ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీ, బిసి మైనార్టీ పేద వర్గాల ప్రజలను చైతన్యం చేస్తూ పాలకులు చేస్తున్న మోసాలను ప్రజలకు తెలియజేస్తూ, ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకగా పేద వర్గాలకు న్యాయం చేయడానికి నడిగడ్డ హక్కుల పోరాటసమితి తరపున పోరాటం చేయడానికి సిద్దంగా ఉన్నామని అన్నారు. డా.బిఆర్ అంబేద్కర్ ఇచ్చినటువంటి బలమైన ఓటు అనే ఆయుధంతో కుటుంబ పాలనకు చరమగీతం పాడి, బహుజన నాయకత్వాన్ని బలపర్చడం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయడానికి ముందుకు రావాలని, నడిగడ్డ ప్రాంతంలో అన్యాయానికి గురవుతున్న పేద ప్రజలను మేలుకొల్పడానికి ప్రజా చైతన్యం కోసం గద్వాల కోటపై బహుజన నాయకత్వాన్ని నిలబెట్టడం కోసం, పేద వర్గాల తరపున పోరాటం చేస్తూ విద్యా, వైద్యం, సంక్షేమం, అభివృద్ధి కోసం నడిగడ్డ ప్రాంతంలో పోరాటం చేస్తున్నామని అన్నారు. ప్రాంతంలో నాటి నుండి నేటి వరకు పాలకులు ఈనడిగడ్డ ప్రాంతంలో ఏలుతున్నప్పటికి ఇప్పటివరకు ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలు డబుల్ బెడ్‌రూం ఇండ్లు, మూడెకరాల భూమి, రైతులకు రుణమాఫీ, వికలాంగులకు, వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలకు పింఛన్లు ఏవి కూడా అందడం లేదని అర్హులైన వారికి ఖచ్చితంగా పేదలకు అందాల్సిన పథకాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, జిల్లా నాయకులు రంగస్వామి, అవనిశ్రీ, పరశురాముడు, ధరూర్ మండల అధ్యక్షుడు నెట్టెంపాడు గోవిందు, ఉపాధ్యక్షులు మునెప్ప, ఆంజనేయులు, కార్యదర్శి రాము, మల్దకల్ మండల అధ్యక్షుడు విష్ణు, ఉపాధ్యక్షుడు ప్రేమ్‌రాజ్, కార్యదర్శి తిమ్మప్ప, కెటిదొడ్డి మండల నాయకులు అంజి, భీమన్‌గౌడ్, రాము, హనుమంతురెడ్డి, దస్తగిరిగౌడ్, గట్టు మండల అధ్యక్షుడు బలరాం, ఆశన్న, లక్ష్మన్న, రాముడు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం..



**వెల్దండ, మార్చి 29 ప్రభాతవార్త:** వెల్దండ మండలం లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొమ్ము కృష్ణయ్య ఇటీవల మృతి చెందారు. మృతుడి కుటుంబాన్ని లింగారెడ్డి పల్లి హనుమాన్ దేవాలయ కమిటీ ఛైర్మన్ కుప్పి రెడ్డి అశోక్‌రెడ్డి గ్రామ సర్పంచ్ మల్లెపాకుల చంద్రమ్మతో కలిసి కుటుంబాన్ని పరామర్శించి మృతుడి భార్యకు రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు సోమయ్య, దేవయ్య, రాఘవరెడ్డి, అనిల్, దానయ్య, కృష్ణయ్య, స్వామిగౌడ్, సైదులు, కుమార్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## నేడు ఎమ్మెల్యే రాక..

**కోయిల్‌కొండ, మార్చి 29 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన కోయిల్‌కొండలో వెలసిన శ్రీరామ కొండ దివ్యక్షేత్రంలో జరిగే శ్రీరామనవమి వేడుకలకు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని కోయిల్‌కొండ గ్రామ సర్పంచ్ బి. కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామకొండ దివ్యక్షేత్రంలో జరిగే శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండలంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

## కౌకుంట్లలో ముస్లింసోదరులకు ఇఫ్తార్ విందు



**దేవరకద్ర, మార్చి 29 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ఉపవాసదీక్షలున్న ముస్లిం సోదరులకు స్థానిక ప్రముఖ సామాజికవేత్త అబ్దుల్ జాంగీర్ ఇఫ్తార్ విందు ఇచ్చారు. స్థానిక జామీయ మజీద్ వద్ద ఈ ఇఫ్తార్ విందు ఇచ్చారు. ప్రతి ఏడాది ముస్లింసోదరులకు అబ్దుల్ జాంగీర్ ఇఫ్తార్ విందు ఇస్తారు. అందులో భాగంగానే ఈ ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త అబ్దుల్ జాంగీర్‌తో పాటు స్థానిక ముస్లిం సోదరులతో పాటు ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



**వెల్దండ, మార్చి 29 ప్రభాతవార్త:** చిరు ధాన్యాలైన రాగులు, సజ్జలు, జొన్నలతో పాటు ఇతర చిరు ధాన్యాలు తింటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తహసీల్దార్ చంద్రశేఖర్ అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం పోషణ పక్షం చిరు ధాన్యాలపై సూపర్‌వైజర్ శంకరమ్మ, జ్యోతిలతో కలిసి తహసీల్దార్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ చిరు ధాన్యాల్లో ఐరన్, కాల్షియం, విటమిన్లు అధికంగా ఉంటాయని, అవి తినడం వల్ల రక్తపోటు, గుండెజబ్బులు, కాలేయ సంబంధిత వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. అనంతరం అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సురేష్, ఎఎన్‌ఎం జహంగీర్‌బీ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌ధరలు

**రూ.6129 ధర పలికిన కింటాల్ ఆముదాలు**

**దేవరకద్ర, మార్చి 29 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు బుధవారం 49 కింటాళ్ళ ఆముదాలను రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. అయితే కింటాల్ ఆముదాలకు అత్యధికంగా రూ.6129 ధర పలికింది. అలాగే అతి తక్కువగా రూ.6053 ధర పలికింది. అలాగే 6 కింటాళ్ళ హంస దాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. కింటాల్ హంస ధాన్యానికి అత్యధికంగా రూ.1638 ధర పలికింది. అతి తక్కువగా కూడ అంతే ధర పలికింది. అలాగే 582 కింలాళ్ళ ఉల్లిని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. కింటాల్ ఉల్లికి అత్యధికంగా రూ.950 ధర పలికింది. అతి తక్కువగా రూ.650 ధరి పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## యంపీడబ్ల్యుఎస్ వర్కర్సుల సమస్యలు తీర్చాలి..

**పంచాయతి కార్యదర్శికి వనతి**



**దేవరకద్ర, మార్చి29 ప్రభాతవార్త:** యంపీడబ్ల్యుఎస్ వర్కర్సుల సమస్యలు తీర్చా లని కౌకుంట్ల మండల కేంద్రంలో బుదవారం పంచాయతి కార్యదర్శికి యం పీడబ్ల్యుఎస్ వర్కర్సులతో కలసి జిపి వర్కర్స్ జిల్లా కార్యదర్శి సాంభశివుడు వినతిపత్రం సమర్పించారు. యంపీడబ్ల్యుఎస్ వర్కర్సులకు కనీస పనిముట్లు ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. అలాగే వారికి ఐడి కార్డులు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఒక పూట పనిదినాలను కల్పించాలని అట్టి వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాంభశివుడుతో పాటు యంపీడబ్ల్యుఎస్ వర్కర్సు తిరుపతి, చెన్నమ్మ, లక్ష్మీ, రామకృష్ణ, శ్రీను, తిరుపతమ్మ, సూరక్క, వెంకటేశ్, శ్రీను, అంజమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## సీతారాముల కల్యాణానికి ముందు శ్రీమహర్షి వాల్మీకి విగ్రహానికి పూజ నిర్వహించాలి



**వనపర్తి టౌన్,మార్చి 29 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సహకారంతో వనపర్తి జిల్లా కేంద్రంలోని రాములోరి దేవాలయంలో వాల్మీకి మహర్షి విగ్రహ పూజ నిర్వహించాలని, రాముల వారి దేవాలయాల్లో వాల్మీకి విగ్రహం ప్రతిష్టించాలని వాల్మీకి సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా కన్వీనర్ మండ్ల దేవన్ననాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామ నవమి హిందువులకు ముఖ్యమైన పండుగ, మిందువులు ఈ పండుగను ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారని అన్నారు. శ్రీరాముడు వసంత ఋతు వులో చైత్ర శుద్ద నవమి, గురువారం పున ర్వసు నక్షత్రపు కర్కాటక లగ్నంలో అభిజిత్ ముహర్తంలో మధ్యాహ్నం 12 గంటల వేళ త్రేతాయుగంలో జన్మించాడు. ఆ మహనీయుని జన్మదినాన హిందువులు ఎంతో వైభవంగా పండుగ జరుపుకుంటారని అన్నారు. అందరి దేవుడు శ్రీరాముడి ని ఎలా పూజిస్తారో వాల్మీకి మహర్షి అలా పూజించాలని ఆయన కోరారు. గతంలో కొన్ని అని వార్య కారణలతో వనపర్తి పట్టణంలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని తరలించడం జరిగిందని అన్నారు. ఈ విషయాన్ని త్వరలో మంత్రితో చర్చించి ఆయన సారధ్యంలో వనపర్తి పట్టణ రామాలయంలో నిర్మిస్తామని అన్నారు. రామాయణ మహా కావ్యాన్ని లోకానికి అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని అన్నారు. ఈ చైత్ర శుద్ధ నవమి నాడు భద్రాచల క్షేత్రంలో సీతారామ కళ్యాణ ఉత్సవాన్ని వైభోవపేతంగా జరుపుతారని అన్నారు. శ్రీరామ నవమి ని భారతీయులందరు పరమ పవిత్రమైన దినంగా భావించి శ్రీసీతారాముల కళ్యాణమహోత్సవాన్ని వైభవంగా పల్లెల్లో, పట్నల్లో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారని అన్నారు.

## రాణిరుద్రమ దేవి విగ్రహ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కలెక్టర్‌కు వినతి



**వనపర్తి టౌన్,మార్చి 29 ప్రభాతవార్త:** విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం వనపర్తిలో రాణిరుద్రమదేవి విగ్రహం నిర్మాణం చేపట్టే విషయమై విగ్రహ నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని స్థానిక పాలిటెక్నిక్ కళాశాల గేట్ ముందు ఎడమపక్క గల ఖాళీ స్థలంలో స్థలాన్ని మంజూరు చేసి నిర్మాణాన్ని అనుమతించవలసిందిగా అదనపు కలెక్టర్ వేణుగోపాల్, మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్ వాకిటి బజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ శివకృష్ణ, నగర బజరంగ జయచందు,మాతృశక్తి సంయోజిక మంగమ్మ, సహా సంయోజిక సుమిత్రమ్మ, దుర్గావాహిని సంయోజిక పద్మ పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు



**వీపనగండ్ల,మార్చి 29 ప్రభాతవార్త:** మార్చి 15వ తేదీ నుండి ప్రారంభమైన ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం ముగిసాయి. వీపనగండ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని కళాశాల ప్రిన్సిపల్ రామ్‌రెడ్డి, డీఓ జ్ఞానేశ్వర్ రెడ్డిలు తెలిపారు. ఇందుకు సహకరించిన అధ్యాపకులకు, ఎస్సై రామన్‌గౌడ్‌కు,పోలీస్ సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ప్రిన్సిపల్ రామిరెడ్డి మాట్లాడుతూ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వనపర్తి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎంసెట్ ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందని ఈ అవకాశాన్నిప్రతి ఒక్క విద్యార్థి ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

## మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు చేస్తున్న అధికారులు

**అమరచింత,మార్చి 29 ప్రభాతవార్త:** మైనార్టీ కార్పోరేషన్ రుణాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులకు బుధవారం అమరచింత మండల పరిధిలోని గ్రామాల మైనార్టీలకు ఎంపీడీఓ కార్యాలయంలో అధికా రులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. నిరుద్యోగులు మైనార్టీలకు ఉపాధి పొందందుకు ప్రభుత్వం 3 యూనిట్లు మంజూరు కాగా 18మంది దర ఖాస్తు చేసుకొని అందరు హాజరయ్యారని మండల ఎంపీడీఓ జ్యోతి పరోషియం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నరసింహులు, యూనియన్ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ బసవరాజు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేత



**ఖిల్లాఘణపురం,మార్చి 29 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేశారు. యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాగితాల మధు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. అలాగే జీవితంలో మంచి పౌరులుగా ఎదగాలని, దేశ భవిష్యత్తు తరగతి గదిలో నిర్మితమవుతుందని ప్రతి విద్యార్థి జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ఆ లక్ష సాధనకు ధీటుగా క్రమశిక్షణతో కృషి చేస్తూ వివిధ రంగాల్లో స్థిరపడాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని, దేశ నిర్మాణంలో ప్రతివిద్యార్థి భాగస్వామ్యం కావాలని అన్నారు. అనంతరం కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు ప్యాడ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు అరుణ, యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాగితాల మధు, ఆంజనేయులు, శివ, సెక్రటరీ గణేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మండలంలో కొనసాగుతున్న కంటి వెలుగు



**పాన్‌గల్,మార్చి 29 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి నేటికి 45 రోజులు కావస్తుండగా దాదాపు మండలంలోని కొన్ని గ్రామాలు పూర్తి కాగా మరికొన్ని గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుంది. అందులో భాగంగా దాదాపు 22 వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించి 2వేలకు పైగా అద్దాలు పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారి తెలిపారు. మరికొంత మందికి కంటి శస్త్ర చికిత్సకు పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ కంటి వెలుగు శిబిరాలను స్థానిక ఎంపీడీఓ నాగేశ్వర్ రెడ్డి పరిశీలిస్తున్నారు.ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్థానిక గ్రామ అధికారులు, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లను సమాయత్తం చేసి పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు.

**కంటి వెలుగు ప్రారంభించిన సర్పంచ్:** మండల పరిధిలోని గోపులాపూర్ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని గ్రామ సర్పంచ్ గంధం రాణి దశరథం, విభూది లక్ష్మయ్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వం పేదల కొరకు ప్రారంభించిన ఈ కార్యక్రమం పేదవారికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ కు, రాష్ట్ర ప్రభుత్వానికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# నేడే రాములోరి కల్యాణోత్సవం

**-అంగరంగా వైభవంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు**

**-వైభవంగా మాస కల్యాణోత్సవం**



భక్తులకు తాళిని చూస్తున్న భక్తులు

**వంగూరు, మార్చి 29, ప్రభాతవార్త:** చారకొండ మండలం శిర్సనగండ్ల గుట్టపై వెలిసిన శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం మాస కళ్యాణం వైభవోపేతంగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మంగళ వాయిధ్యాలతో ఆలయ అర్చకులు, పూజారులు భక్తుల సమక్షంలో నిర్వహించారు. స్వామి వారి కళ్యాణోత్సవాని ్న తిలకించేందుకు వివిధ నియోజకవర్గాల నుంచి ప్రముఖులు హాజరై ప్రత్యేక పూజలు చేపట్టారు.స్వామి వారి మాస కళ్యాణం కళ్యాణోత్సవానికి ముందు రోజు నిర్వహించడం అనవాయితీగా సాగుతుంది. డీసీసీ జిల్లాఅధ్యక్షులు,మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడువంశీకృష్ణ, అమ్రాబాద్ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ, మాజీ జెడ్పీటీసీలు వెంకట్‌గౌడ్, భీముడు నాయక్, చారకొండ మండలఅధ్యక్షులు బాల్‌రాంగౌడ్, చారకొండ ఎస్ఐ దంపతులు,ఆలయ చైర్మన్ దేరం రామశర్మ హాజరై మాస కళ్యాణోత్సవాన్ని తిలకించారు.

**నేడే రాములోరి కళ్యాణోత్సవం:** శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం చారకొండ మండలం శిర్సనగండ్ల గుట్టపై ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ దేరం రామశర్మ,ఈఓ రఘులు తెలిపారు. కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు ఉమ్మడి జిల్లా మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎంపీ పోతుగంటి రాములు, కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఆర్డీఓరాజేష్‌కుమార్, కల్వకుర్తి,అచ్చంపేట మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, వంశీచంద్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా జెడ్పీవైస్‌చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోళి శ్రీనివాస్‌రెడ్డి,కాంగ్రెస్ టీపీసీసీ అధికార ప్రతినిధి చారకొండ వెంకటేష్, అచ్చంపేట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మోపతయ్యలతో పాటు పలువురు నాయకులు,కార్యకర్తలు హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ లాంఛనాలతో కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.



మాస కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

**కల్యాణోత్సవానికి భారీ బందోబస్తు:** శ్రీరామనవమిని పురస్కరించుకొని శిర్సనగండ్ల గుట్టపై గురువారం నిర్వహించే శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవానికి భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు కల్వకుర్తి డీఎస్పీ గిరిబాబు,వెల్దండ సీఐ రామకృష్ణలు తెలిపారు. కళ్యాణోత్సవానికి డీఎస్పీ గిరిబాబుతో పాటు 4మంది సీఐలు, 15మంది ఎస్ఐలు, 180 మంది పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. కళ్యాణోత్సవంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ ప్రాంగణం మొత్తం సీసీ కెమెరాలను అమర్చి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. అదే విధంగా కళ్యాణోత్సవానికిహాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా దాహార్తిని తీర్చేందుకు తాగునీటి సదుపాయం కల్పించినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు.

## ప్రపంచంలో శాంతికి ముఖ్యకేంద్రం భారతదేశం

**- సత్యశాంతి సందేశ కేంద్రం వ్యవస్థాపకుడు మౌలానా నాసిర్**



కౌకుంట్లలో మౌలానా నాసిర్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

**దేవరకద్ర,మార్చి 29 ప్రభాతవార్త:** ప్రపంచం మొత్తంలో శాంతికి ముఖ్యకేంద్రం భారతదేశం అని సత్యశాంతి సందేశ కేంద్రం వ్యవస్థాపకుడు మౌలానా నాసిర్ అన్నారు.కౌకుంట్ల మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ఒక రోజు ఆధ్యాత్మిక సమ్మేళనం సమావేశాన్ని నిర్వహించారు. వసుదైక కుటుంబం అనే భావన పెంపొందేలా ఈ ఆధ్యాత్మికసమ్మేళనం సమావేశాన్ని నిర్వహించారు.ఈ ఆధ్యాత్మిక సమ్మేళనం సమావేశానికి సత్యశాంతి సందేశ కేంద్రం వ్యవస్థాపకుడు మౌలానా నాసిర్ ముఖ్య అతిథిగా హాజరై తమ సందేశాన్ని ఇచ్చారు.సర్వ మానవ సౌభ్రాతృ త్వాన్ని పెంపొందించేలా తమ సంస్థ పాటు పడుతుందన్నారు.అన్ని మతాల సారం ఒక్కటేనని అన్నారు.ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక ప్రంధాలయాలైన దివ్యఖురాన్,బైబిల్,భగవద్గీతలను నిరంతరం చదువాలన్నారు.అందరూ కలసి మెలసి ఉండాల న్నారు.ఒకరి కష్టసుఖాలలో ఒకరు భాగస్వామ్యం కావాలన్నారు.అందరూ ఆనందంగా కులమతాలకు అతీతంగా తమ జీవితాలను గడ పాలన్నారు. కల్మశం లేని మనసులతో బతుకడానికి ప్రయత్నించాలన్నారు. అప్పుడే మనిషి జన్మకు సార్ధకత చేకూరుతుందన్నారు. సర్వ మతాలకు నిల యం మన భారతదేశమన్నారు.మనందరం భారతీయులుగా ఉండటం ఎంతో గర్వకారణమన్నారు.ఇది ఒక రకంగా అదృష్టంగా భావించాలన్నారు.

**మౌలానా నాసిర్‌కు ఘన సన్మానం:** కౌకుంట్ల మండల కేంద్రంలో గ్రామస్థులు సత్యశాంతి సందేశ కేంద్రం వ్యవస్థాపకుడు మౌలానాను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో యంపీటీసీ కిష్టన్న,మాజీ యంపీపీ గోపాల్,ప్రముఖ సామాజిక వేత్త షేక్ అబ్దుల్ జాంగిర్,నాయకులు తుమ్మల శేఖర్‌రెడ్డి, శివకుమార్,సాంభశివుడు,చందూగౌడ్,స్థానిక జామియ మజీద్ కమిటీ సభ్యులు,ముస్లింసోదరులులతో పాటు గ్రామస్థులు,పరిసరి గ్రామాలకు చెందిన ప్రజలు,యువకులు,నాయకులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

## సంక్షేమ పథకాలకు పెద్దపీట వేసింది తెలుగుదేశం పార్టీ

**- ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**





టీడీపీ జెండా ఆవిష్కరణ చేస్తున్న జిల్లా నాయకులు

**వనపర్తి టౌన్,మార్చి 29 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ 41వ ఆవిర్భావ వేడుకలు జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ వెంకటయ్య యాదవ్, రాష్ట్ర నాయకులు నందిమల్ల శారద,రవియాదవ్, దస్తగిరిలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు బి.రాములు, నందిమల్ల అశోక్ లు మాట్లాడుతూ రాజకీయ చరిత్రలో తెలుగుదేశం పార్టీ ఒక ప్రబంజనం అని అన్నారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు పార్టీ స్థాపించిన 9నెలల కాలంలోనే 97ఏండ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీని మట్టి కల్పించి చరిత్ర సృష్టించారని అన్నారు.ఎన్టీఆర్ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, 2రూ.కిలో బియ్యం.పక్కా గృహాలు, జనతా వస్త్రాల పంపిణీ, రైతులకు సబ్సిడీ కరెంట్, పటేల్ పట్వారి వ్యవస్థ, మహిళలకు సమాన ఆస్థి హక్కు కల్పించిన ఘనత ఎన్టీఆర్ కు దక్కుతుందని అన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో నిలిపారని అన్నారు. వనపర్తి ప్రజలు రావు నాయకత్వం కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నందిమల్ల రమేష్, కౌన్సిలర్ ఏర్పుల లక్ష్మీ, వహీద్, బలరాం, ఆవుల శ్రీను, చిన్నయ్య యాదవ్, ఖాదర్, డి.బాలరాజు, బాలు నాయుడు, బాలయ్య, కొత్త గొల్ల శంకర్, అనిల్, చిట్యాల బాలరాజు, గంధం కృష్ణయ్య, రాజు మేస్త్రీ, మైనార్టీ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేత



బాధితునికి ఆర్థిక సహాయం చేస్తున్న పీట్ల కతాల్

**పాన్‌గల్,మార్చి 29 ప్రభాతవార్త:** మండల పరిధిలోని రేమొద్దుల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, పారిశ్రామికవేత్త వడ్డెర సంఘం జిల్లా నాయకుడు పీట్ల కతాల్ గ్రామంలోని రెండు నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుని తన దాతృత్వాన్ని చాటుకున్నాడు. బుధవారం గ్రామంలోని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయన్ని అందజేశారు. ఇటీవల గ్రామానికి చెందిన కిల్లె శంకర్ విద్యుత్ షాక్ తో మృతి చెందగా వారి కుటుంబ సభ్యుల పేరుతో రూ.30వేలు స్థానిక పోస్టాఫీస్ లో డిపాజిట్ చేసి సంబంధించిన బాండ్ పేపర్లను కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన మాల శంకర్ అకస్మాత్తుగా పక్షవాతం బారిన పడడంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారనితెలుసుకొని బాదితుడిని పరామర్శించి రూ.30వేల బాదితునికి అందజేశారు. గతంలో కూడా గ్రామానికి సంబంధించి ఎన్నో సహాయ సహకరాలు అందించారు. ఇక ముందు కూడా గ్రామానికి, గ్రామంలోని నిరుపేదలకు కూడా తమ సహాయ సహకారాలు అందజేస్తానని పీట్ల కతాల్ తెలిపారు. మానవత్వంతో చాటుకోవడంలో ఎంతో తృప్తి ఉందన్నారు. ప్రతి ఒక్కరు కూడా ఇలాగే తోటి వారికి సహాయ సహకారాలు అందజేస్తూ మానవత్వం చాటుకోవాలనిఅన్నారు.బాదిత కుటుంబాలను ఆర్థికంగాఆదుకోవడం పట్లగ్రామనాయకులు,ప్రజా ప్రతినిధులు పీట్ల కతాల్ దాతృత్వాన్ని అభినందించారు.

## ప్లాస్టిక్‌ను నిషేదిద్దాం..పర్యావరణాన్ని రక్షిద్దాం..!

**-ఆత్మకూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గాయిత్రి రవి కుమార్ యాదవ్**



ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదించాలని ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ అధికారులు, విద్యార్థులు

**అమరచింత,మార్చి 29 ప్రభాతవార్త:** ఆత్మకూర్ పట్టణంలో ఉన్న వివిధ షాపుల్లో ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న షాపు యజమానులకు ప్లాస్టిక్ కవర్లను నిషేదించి, పర్యావరణాన్ని రక్షించుకుందాం అని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయిత్రి రవికుమార్ యాదవ్ వ్యాపారస్థులను కోరారు. బుధవారం ఆత్మకూర్ మున్సిపల్ కేంద్రంలోని స్వచ్ఛభారత్‌లో భాగంగా స్వచ్ఛత పట్టణంలో ర్యాలీ నిర్వహించి గాంధీ చౌక్ లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ నిర్వహించారు. ప్రజలు ప్లాస్టిక్ కవర్లను వాడకుండా బట్ట సంచులను ప్రతి ఒక్కరు వాడాలని ఆమె ప్రజలను కోరారు. అలాగే వ్యాపారస్థులు ప్లాస్టిక్ కవర్లను వాడితే జరిమానాలు విధిస్తామని షాపు యజమాన్యులు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ బీఎన్‌కె రమేష్, మున్సిపల్ వైస్ చైర్మెన్ విజయభాస్కర్ రెడ్డి తో పాటు మహిళలు, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

**అమరచింత,మార్చి 29 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో బీజేపీ విజయానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని బీజేపీ మక్తల్ నియోజకవర్గ ఇంచార్జీ ప్రభారీ సుభాష్ చందర్ జీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలో బూత్ స్వశక్తికరణ్ అభియాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు పరచడం లేదని, దళితులకు 3ఎకరాల భూమి, డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తానని హామీ ఇచ్చిన అమలు చేయడంల ఏదని అన్నారు. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ లో ముఖ్యమంత్రి హస్తం ఉందని, అమాయకులను బలి చేస్తున్నారని తక్షణమే సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమప థకాలను రాష్ట్ర ప్రభుత్వం కాపీ కొడుతుందని, బీజేపీ కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడప గడపకు తీసుకెళ్లాలని ఆయన కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు, బీజేపీ పట్టణ అధ్యక్షులు క్యామ భాస్కర్, ఎం.అశోక్ కుమార్, పి.సురేష్, రవి, నరసింహ, రామలింగం, భరత్, కె.ఆంజనేయులు, మంగ అనిల్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల విస్తరణను పరిశీలించిన కలెక్టర్



2వ వార్డులో రోడ్డును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**వనపర్తి ప్రతినిధి,మార్చి 29 ప్రభాతవార్త:** వనపర్తి లోని గాంధీచౌక్ లో 2వ వార్డు రోడ్ల విస్తరణలో బాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఆర్ అండ్ బీ, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ బి.కృష్ణ మాట్లాడుతూ స్థానిక 2వ వార్డు మొల్లగేరి, బ్రాహ్మణ వీధి, కమాన్ చౌరస్తాకు ఉన్న లింకు రోడ్లకు మెయిన్‌రోడ్ ఎత్తుకావడంతో ఈవీధిలోకి పోవడానికి ప్రజలకు అసౌకర్యంగా మారి ప్రతిరోజు ప్రమాదాలు జరుగుతున్నాయని, గత మూడు నెలల నుండి అధికారులు ఈ సమస్యలను పరిష్కరించడం లేదని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ తక్షణమే అధికారులపై సీరియస్‌గా స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్ అండ్ బీ అధికారులు దానయ్య, మున్సిపల్ ఇంజనీర్ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి





సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

**అమరచింత,మార్చి 29 ప్రభాతవార్త:** సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై శివనాగేశ్వర్ నాయుడు అన్నారు. బుధవారం అమరచింత జిల్లా పరిషత్ పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు బ్యాంక్ నుండి ఫోన్ చేసేనత ఓటీపీ నెంబర్ చెప్పవద్దని అలా చెబితే అకౌంట్ లో ఉన్న డబ్బులు సైబర్ నేరగాళ్లు కాజేస్తారని ఆయన తెలిపారు. అలాగే మహిళలపై ఎవరైన దాడులు చేస్తే టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని మహిళలను కోరారు. వాట్సప్ గ్రూప్‌లో మతాలను కించపరిచే విధంగా పోస్టులు పెడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో అనుమానస్పద వ్యక్తులు తిరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలు సైబర్ నేరాలకు మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వం విశ్వబ్రాహ్మణులకు ఇచ్చిన హామీని అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పరమేశ్వర చారి

**వనపర్తి టౌన్,మార్చి 29 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విశ్వబ్రాహ్మణులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని విశ్వకర్మ ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర చారి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తెలంగాణ ప్రభుత్వంవిశ్వబ్రాహ్మణ జాతికి రూ.250కోట్లు ప్రకటించి నేటి వరకు అమలు చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. తెలంగాణ వస్తే మన బ్రతుకుల బాగుపడుతాయని మారోజు వీరన్న నుండి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వరకు నీళ్లు, నిధులు, నియామకాలు మన వాటా ఎంత అని లెక్కలు చెప్పిన జయశంకర్ సార్ చెప్పాడని అన్నారు. ఆనాడు మలిదశ ఉద్యమం ఉగ్రూతలూగుతున్న సమయంలో ఇక తెలంగాణ రాదేమో అనే ఆలోచనలో కాసోజు శ్రీకాంతాచారి ఎల్బీనగర్ చౌరస్తా దగ్గర పెట్రోల్ పోసుకొని తెలంగాణ కొరకు ఆత్మ బలిదానం చేసుకున్నాడని గుర్తు చేశారు. నేడు ఆత్మ బలిదానాలు చేసుకున్న కుటుంబాలను విస్మరించి తెలంగాణ ప్రభుత్వం విమర్శించిన వారికే మంత్రి పదవులు ఇస్తూ తెలంగాణ కొరకు పోరాటు చేసిన విశ్వబ్రాహ్మణ జాతిని మరిచి ఇచ్చిన హామీని కూడా అమలు చేయకపోవడం చాలా బాధాకరని అన్నారు.ఈకార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎన్.సత్య నారాయణ చారి, లాంగమూర్తి ఆచారి, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

## విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన



**ఖిల్లాఘణపురం,మార్చి 29 ప్రభాతవార్త:** మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎస్సై శ్రీహరి ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎస్సై శ్రీహరి మాటా ్లడుతూ పోలీస్ శాఖ ఆదేశాలమేరకు సైబర్ అంబాసిడర్‌తో భాగంగా ప్రతి విద్యార్థికి సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని ఎస్సై ఆకాంక్షించారు.అపరిచిత వ్యక్తుల నుండి ఫోన్ వచ్చిన ఓటీపీ పాస్వర్డ్ లను తెలపరాదని సూచించారు. సైబర్ నేరగాళ్లు మంచి మాటలతో మోసం చేస్తారని తెలిపారు. ఇతర వ్యక్తులతో ఏటీఎం కార్డు వివరాలు ఫోన్ వివరాలు పంచుకుంటే బ్యాంకు ఖాతాలోని డబ్బులను కాజేస్తారని అన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని అన్నారు. తల్లిదండ్రులు చెప్పిన విధంగా నడుచుకొని ఉన్నత లక్ష్యాలతో అద్భుత ఫలితాలు సాధించాలని తెలిపారు.రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మధు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

## 10వ తరగతి పరీక్ష కేంద్రాలను సందర్శించిన అధికారులు



**పాన్‌గల్,మార్చి 29 ప్రభాతవార్త:** వచ్చే నెల 3వ తేదీన జరగబోయే 10వ తరగతి పరీక్ష కేంద్రాలను బుధవారం మండల ప్రత్యేక అధికారి సురేష్, మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణ్ నాయక్ లు సందర్శించారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జరగనున్న పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కావాల్సిన మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్లపై స్థానిక ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన సూచించారు. వారి వెంట ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## టీటా ఆధ్వర్యంలో 100 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులచే విద్యార్థులకు శిక్షణ



జిల్లా కలెక్టర్‌తో జై మఖ్తల ట్రస్టు సభ్యులు

**మక్తల్,మార్చి 29 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలోని మక్తల్ నియోజక వర్గంలో బుధవారం తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్, జై మక్తల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో దాదాపు 44 ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు పూర్తిగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులచే అవగాహన కల్పించడంతో పాటు ఒత్తిడిని జయించి పరీక్షల్లో ఉన్నతంగా రాణించేలా తర్ఫీదు ఇచ్చారు. టీటా గ్లోబల్ ప్రెసిడెంట్ సందీప్ కుమార్ మఖ్తల జన్మదినాన్ని పురస్కరించుకుని దాదాపు 100 మంది సాఫ్ట్వేర్ ఉద్యోగులు ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులతో మమేకమై వారికి ఓరియంటేషన్ ప్రోగ్రాంపై శిక్షణ కల్పించారు. పని దినమైనప్పటివి విధులను వదిలి సందీప్ కుమార్ మఖ్తల్ స్వస్థలమైన మక్తల్ ప్రాంతంలో విద్యార్థులతో ఒక రోజంతా గడిపి వారికి పరీక్షల్లో ఉన్నతంగా రాణించేలా శిక్షణ అందించారు. నియోజకవర్గ వ్యాప్తంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు చేపట్టిన ప్రక్రియను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రశంసించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో టీటా బృందాన్ని పిలిచి మరి ధన్యవాదాలు తెలిపారు. రమ్యశర్మ, అభిలాష్ రంగినేని, రోహిత్ సాయిరాందాస్‌పల్లి, పూజ బండారి తదితరులను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు చేపట్టిన ప్రక్రియను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రశంసించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో టీటా బృందాన్ని పిలిచి మరీ ధన్యవాదాలు తెలిపారు. రమ్యశర్మ, అభిలాష్ రంగినేని, రోహిత్, సాయిరాం దాస్‌పల్లి పూజ బండారి తదితరులను కలెక్టర్‌అభినందించారు. ఈసందర్భంగానియోజకవర్గ వ్యాప్తంగాఓరియంటేషన్ ప్రోగ్రాంలోపాల్గొన్న మహ్మద్‌ఇలియాజ్,వర్షిత, మేఘన, రాణా ప్రతాప్, వినయ్‌తూముతదితరులకు సందీప్ మఖ్తల ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## రైతులకు విత్తనాలు పంపిణీ

**మల్దకల్,మార్చి 29 ప్రభాతవార్త:** మల్దకల్ మండలంలోని రైతు వేదికలో జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా పామాయిల్ రైతులకు చిరు సంచుల మినుములు (విబియన్ 8) విత్తనాలను పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ వేసవిలో పామ్ ఆయిల్ నందు అంతర పంటగా సాగు చేసేందుకు అనువుగా ఉంటుంది. అదేవిధంగా దీని పంటకాలం 75,80 రోజులుగా ఉండి 8నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి ఇస్తుంది. కార్యక్రమంలో భాగంగా మల్దకల్ గ్రామ సర్పంచ్ యాకోబు, ఎంపిటిసి రాజు, విస్తరణ అధికారులు, వివిధ గ్రామాల నుంచి రైతులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీల్లో స్వచ్ఛతా మషాల్ ర్యాలీ

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మార్చి 29, ప్రభాతవార్త :** మున్సిపల్ శాఖ ఆదేశాల మేరకు మున్సిపాలిటీల్లో స్వచ్ఛతా మషాల్ ర్యాలీ నిర్వహించారు. ఈమేరకు మహబూబ్‌నగర్‌లో కలెక్టర్ జి రవినాయక్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, ముడా చైర్మన్ గంజి వెంకన్న, అదనపు కలెక్టర్ సీతా రామారావు ర్యాలీని ప్రారంభించారు. జడ్చర్లలో కమిషనర్ షేక్ అహ్మద్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా 1500 మంది ఎస్‌హెచ్‌జీ మహిళలు మెప్మా ఆఫీస్‌లో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. పట్టణంలోని ఎక్స్‌పో ప్లాజాలో మున్సిపల్ కంపోస్ట్ విక్రయ స్టాల్ , వేస్ట్ టు వెల్త్ ప్రదర్శన స్టాల్ ఏర్పాటు చేశారు. 2కేజీ, 5,20 కేజీల బ్యాగులను మున్సిపాలిటీ వానపాముల ద్వారా తయారు చేసిన కంపోస్ట్‌ను ప్యాకింగ్ చేసి విక్రయించారు.

## కోటిలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

**కొత్తకోట,మార్చి 29 ప్రభాతవార్త:** మండల పరిధిలోని శ్రీదత్త కోటిలింగేశ్వర ఆలయంలో శివుని జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా బుధవారం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఏకరుద్రాభిషేకం, పంచామృతా భిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శేఖరయ్య, మహేశ్వర్‌చ అర్చకులు జగదీశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## సలేశ్వరం జాతర ఉత్సవాల వేలం పాట

**లింగాల,మార్చి 29 ప్రభాతవార్త :** సలేశ్వరం జాతర ఉత్సవాల సందర్భంగా కొబ్బరికాయలు, తైబజార్ వేలం నిర్వహించినట్లు సర్పంచ్ నీలవేణి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో సర్పంచ్ నీలవేణి అధ్యక్షతన రచ్చబండ ప్రాంగణంలో కొబ్బరికాయలు, తైబజార్ వేలం నిర్వహించారు. కొబ్బరికాయలు వేలంలో మంద్రేకారి శంకోజి రూ. 31 వెలకు వేలం పాడి దక్కించుకున్నారు. అదేవిధంగా తైబజార్ వేలం పాటలో యాదగిరి సలేశ్వరం రూ.10 వేలుపాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఎంపిటిసికాశినాథం,మాజీ ఉపసర్పంచ్ పర్వతాలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీతారాములవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల

**లింగాల,మార్చి29 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో సీతారాముల వారిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బుధవారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చన, అభిషేకం నిర్వహించి హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ కళ్యానం ముందు రోజే స్వామివారిని దర్శించుకోవడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో ఆలయకమిటి చైర్మన్ బళ్ళారి నాగేశ్వర్, అల్లె శ్రీనివాసులు, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సుధీర్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ జంబుల హనుమంత్‌రెడ్డి, రానోజీ, మల్లేష్, జనార్ధన్, శ్రీనివాసులు, మార్కం పర్వతాలు, గట్టు కురుమయ్య పాల్గొన్నారు.

## శాంతినికేతన్ పాఠశాలకు జిల్లా మొదటి ర్యాంక్

**తెల్కపల్లి,మార్చి29 ప్రభాతవార్త :** మండల కేంద్రానికి చెందిన శాంతినికేతన్ విద్యార్థులు అత్యంత ప్రతిభ చాటి సివి రామన్ రాష్ట్ర ఒలంపియాడ్‌ల్లో జిల్లా స్థాయి మొదటి రెండవ ర్యాంకులను కైవసం చేసుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ సురేంద్రరావు బుధవారం రాత్రి తెలిపారు. 9వ తరగతికి చెందిన శ్రీ వర్షిని జిల్లాస్థాయి మొదటి ర్యాంక్, ఎనిమిదో తరగతికి చెందిన ప్రపుణ్య జిల్లా స్థాయి రెండో ర్యాంకులు కైవసం చేసుకున్నట్లు వారు తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ సురేందర్‌రావు, డైరెక్టర్ బాలమణి బుచ్చన్న, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందించారు.

## బాధితున్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**లింగాల,మార్చి 29 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ మండల టౌన్ అధ్యక్షులు ఎల్లేష్ గతకొద్ది రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఇటీవల ఆపరేషన్ చేయించుకోవడంతో విషయం తెలుసుకున్న ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బుధవారం బాధితున్ని పరామర్శించారు. ధైర్యంగా ఉంటూ సకాలంలో మందులు వాడాలని సూచించారు. ఆయన వెంట సింగిల్ విండో ఛైర్మన్ హనుమంత్‌రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు సుధీర్‌గౌడ్, బళ్లారి నాగేశ్వర్, మల్లేష్, శ్రీనివాసులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

**పాన్‌గల్,మార్చి 29 ప్రభాతవార్త:** బుసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇగుంమోని సుధాకర్ తండ్రి బాలయ్య (40) పుట్టుకతో చెవిటి,మూగ దానికి తోడు అప్పుడప్పుడు మూర్చ వ్యాధితో కూడా బాధపడుతున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే తేది 25.05.2023రోజు పెబ్బేరు సంతకు పోయి వస్త అని ఇంట్లో సైగలతో చెప్పి ఒక్కడే పోయాడు. మళ్లీ తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించనందున పాన్‌గల్ పోలీస్ స్టేషన్‌లో భార్య చెన్నమ్మ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నాగన్న తెలిపారు.

# మహ్మద్ హుస్సేన్ చెరువులో మట్టి దందా..!

- గుట్టుచప్పుడు కాకుండా రాత్రి వేళలో దొంగచాటుగా అక్రమ రవాణా..
- మామూళ్ల మత్తులో పట్టించుకోని అధికారులు
- రైస్ మిల్లు నిర్మాణానికి అక్రమంగా ఇసుక, మట్టి తరలింపు..
- భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి

**వనపర్తి ప్రతినిధి,మార్చి 29 ప్రభాతవార్త:** పెద్దమందడి మండలం మద్దిగట్ల మహ్మద్ హుస్సేన్ చెరువు శికం భూమిలో మట్టి దందా జోరుగా సాగుతోంది. అక్రమార్కులు పెద్దమందడి మండలంలో ఇసుక దందా, మట్టి దాందాను పెద్దఎత్తున తెరలేపారు. ఈ దందాలో రోజు రోజుకు మాంయా రెచ్చిపోతుంది. అధికారులకు కాసులు ఎరచూపి సహజ సంపదను ఎదేచ్ఛగా కొల్లగొడుతున్నారు. పగలురాత్రి అనే తేడా లేకుండా యంత్రాలతో మట్టిని రవాణా చేస్తున్నారు. మామూళ్లమత్తులో అధికార యంత్రాంగం మౌనం వహిస్తుండడంతో ప్రభుత్వ, ప్రైవేటు భూమి నుండి మట్టిని విచ్చలవిడిగా దోచేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు గండికొడుతూ దోచుకున్నోడికి దోచుకున్న తరహాలో ప్రభుత్వ చెరువులో మట్టి దందాను కొనసాగిస్తున్నారు. పెద్దమందడి మండలం మోజర్ల శివారులో ఇటీవల నిర్మిస్తున్న ఒక రైస్ మిల్లుకు అమ్మపల్లికి చెందిన ఓ వ్యక్తి మద్దతుతో మట్టిని, ఇసుక ను అక్రమంగా తరలించేందుకు ఒప్పందం కుదిరినట్లు తెలిసింది.



చెరువులో మట్టి తవ్వకాల దగ్గర ఆగి ఉన్న హిటాచి

మట్టిని రవాణా చేసేందుకు రూ13లక్షలకు బేరం కుదుర్చుకొని అందరిని తానే చూసుకుంటానని గత 5రోజులుగా రాత్రి వేళల్లో మట్టిని టిప్పర్ల ద్వారా రవాణా చేస్తున్నారు. కొత్తకోట మండలం పామాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన టిప్పర్లతో అక్రమంగా వందల కొద్ది ట్రిప్పుల మట్టిని ఇప్పటికే తరలించి మహ్మద్ హుస్సేన్ చెరువును లూటీ చేస్తున్నారు. ఈ విషయం నీటిపారుదల, ఇతర శాఖల అధికారులకు తెలిసినప్పటికీ ఉదాసీనతగా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తుంది. సంబంధిత రైస్ మిల్లు దగ్గర ఇప్పటికే పెద్దఎత్తున అక్రమంగా ఇసుక ను తరలించి దంపులు చేశారు. గోదాం, మిల్లు బరంతి నింపేందుకు వందల కొద్ది టిప్పర్లతో మట్టిని సరఫరా చేస్తున్న ఇటు ప్రజాప్రతినిధులు కానీ అధికారులు కానీ నోరుమెదపకపోవడం విశేషం. చెరువుల్లోనే కాకుండా గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతం నుండి అక్రమార్కులు మట్టిని తరలిస్తున్నారు. అధికారుల నిఘా లేకపోవడంతో ప్రభుత్వ భూమిలోగ్రావెల్ తవ్వకాలు ఆగడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భారీ యంత్రాల ద్వారా ప్రభుత్వ భూముల్లో మొర్రం తరలింపు చేపడుతున్న పెద్దమందడి మండలం అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. గత కొద్దిరోజులుగా నిరంతరాయంగా మండలంలో మట్టి, ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నప్పటికీ రెవెన్యూ,మైనింగ్, పోలీసు యంత్రాంగం మౌనం వహిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తుంది. అనుమతులు లేకుండా తవ్వకాలు చేపట్టడం విమర్శలకు దారి తీస్తుంది. ఒకవైపు గ్రావెల్ మాఫియా రెచ్చిపోతుంటే అరికట్టాల్సిర అధికారులు తమకేం సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. మట్టి అక్రమ తరలింపుకు కొందరు గ్రామస్థులు అడ్డుచెప్పినప్పటికీ మిల్లు యజమాని పెడచెవిన పెట్టడంతో గ్రామస్థులు మట్టి, ఇసుక రవాణాను అడ్డుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.



అక్రమంగా రవాణా చేసి నిల్వ ఉంచిన ఇసుక దంపు



మహ్మద్ హుస్సేన్ చెరువు శికం భూమిలో మట్టిని తరలించడంతో గుంతలమయం అయిన చెరువు



భారీగా మట్టి తరలించి నిండుగా భరంతి నింపిన దృశ్యం

## నియోజకవర్గ నిరుపేదల అభివృద్ధే లక్ష్యం

- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

**తెల్కపల్లిమార్చి 29 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ నియోజకవర్గ నిరుపేదల అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం పని చేస్తున్నానని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రానికి చేరుకున్న వారు స్థానిక నెహ్రూ చౌరస్తాలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, అదేవిధంగా మండలంలోని నిరుపేద మహిళలకు ఎంజెఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో 53 కుట్టు మిషన్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో రకాల సంక్షేమ ఫలాలను అందించిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదని అన్నారు. రైతుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేసిందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మర్రి జనా ర్ధన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ రఘునందన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

హనుమంతరావు, ఎంపిపి కొమ్ము మధు,వైస్ ఎంపిపి విజయనిర్మల, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు ఈదుల నరేందర్‌రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి,వైస్ ఛైర్మన్ఎం.యాదయ్య,రైతుబంధు మండల కన్వీనర్ మాధవరెడ్డి, ఎంపిటిసిలు ఆర్.రమేష్,లక్ష్మమ్మ, విజయలక్ష్మి, తహసిల్దార్ తబితారాణి, టౌన్ అధ్యక్షులు సత్యం, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ప్రభుత్వ విప్

**పదర, మార్చి 29 ప్రభాతవార్త:** మండలంలో బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు విస్తృతస్థాయి సమావేశంలో పార్టీ శ్రేణులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తెలంగాణలో ప్రతి గడప గడపకు కెసిఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. ప్రతిపక్షాల విష ప్రచారాలను అడ్డుకునేలా పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి కెసిఆర్ సంక్షేమ పథకాలు మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మనదేశంలో అన్ని మతాల కలయికతో ఒక సెక్యులర్ భావాలు ఉన్నటువంటి పార్టీ బిఆర్ఎస్ పార్టీ ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు విపక్షాల కుట్రలకు అడ్డుకట్ట వేసేందుకు ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పార్టీ శ్రేణులకు తెలియజేశారు. ప్రపంచ వ్యాప్తంగా గర్వంగా చెప్పుకోగల పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని ఎమ్మెల్యే గువ్వల బారాజ్ అన్నారు. కార్యక్రమంలో ముందుగా బిఆర్ఎస్ జెండాను ఆవిష్కరించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల ప్రెసిడెంట్, జడ్పీటిసి, ఎంపిపిలు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, సింగిల్ విండో డైరెక్టర్లు వార్డు మెంబర్లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## యువతకు క్రికెట్ కిట్ అందజేసిన ఎమ్మెల్యే

**మూసాపేట,మార్చి 29 ప్రభాతవార్త:** మూసాపేట పరిధిలోని నిజాలాపూర్ గ్రామానికి చెందిన యువకులకు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నాసాగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం క్రికెట్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటిసి ఇంద్రయ్యసాగర్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు లక్ష్మీనరసింహ యాదవ్, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడు మాత్రమే మట్టిలోని మాణిక్యాలను తీర్చిదిద్దేది

శ్రీశారద హైస్కూల్ వార్షికోత్సవం వేడుకలలో హాజరైన ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి

**గద్వాల ప్రతినిధి,మార్చి 29 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని కుంట వీధిలో శ్రీశారద హైస్కూల్ వార్షికోత్సవం వేడుకలలో కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి హాజరయ్యారు. పాఠశాల ప్రిన్సిపల్ ఎమ్మెల్యే సతీమణికి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే సతీమణి చేతుల మీదుగా 2022లో పదవ తరగతిలో 10/10 మంచి ప్రతిభను సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేసి విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. ఎమ్మెల్యే సతీమణి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాతే రాష్ట్రంలో విద్యా రంగానికి సీఎం కెసిఆర్ ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. గతంలో మనప్రాంతం అక్షరాస్యతలో వెనకబడి ఉండేదని ఇప్పుడిపునపడే ప్రతి గ్రామంలోని ప్రజలు వారి పిల్లలు చదువుకోవాలని వారి భవిష్యత్తులో మంచిగా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆలోచించి ప్రతి ఒక్కరు వారి పిల్లలను చదివించడం జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి చదువు ఇష్టపడి చదుకోవాలని చదువు వల్ల మన జ్ఞానము,సంస్కారం నేర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాల అసోసియేషన్ అధ్యక్షుడు బీమపల్లి, పాఠశాల ప్రిన్సిపల్ బాబునాయుడు, మహిళా నాయకురాలు రాధా, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం సీనియర్ మేట్ల సమావేశ కార్యక్రమం

**గద్వాల ప్రతినిధి,మార్చి 29 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లాలోని మహాత్మ గ్రామీణ ఉపాధి హామీ పథకం సీనియర్ మేట్ల సమావేశం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో అన్ని మండలాల సీనియర్ మేట్లను అధ్యక్షులు, ఉపాధ్యక్షులుగా ఎన్నుకోవడం జరిగింది. 12 మండలాల నుంచి గద్వాల జిల్లా అధ్యక్షులుగా ధరూర్ మండలం యు.నరసింహులు,ఉపాధ్యక్షులుగా అయిజమండలం నాగరాజు,కెటిదొడ్డి మండల ప్రధాన కార్యదర్శి శివుడు, కోశాధికారిగా ఇటిక్యాల మండలం నాయుడు, సలహాదారుడిగా గద్వాల మండలం రామన్న,కార్యదర్శిగా గట్టు మండలం నారాయణ ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమాన్ని అందరు సీనియర్ మేట్లు కలిసి ఎంతో విజయవంతం చేశారు.

## విద్యార్థులు పరీక్షల సమయాన్ని గమనించాలి

- నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**నారాయణపేట ప్రతినిధి,మార్చి 29 ప్రభాతవార్త :** 2023 ఏప్రిల్ నుంచి 10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు మొదటి లాంగ్వేజ్, సైన్స్ పరీక్ష పేపర్లకు పరీక్ష మధ్యలో పేపర్ మార్పిడికి 20 నిమిషాల సమయ కేటాయించిన విషయాన్ని విద్యార్థులు గమనించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 3నప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలు ఉదయం9.30గం.ల నుండి మధ్యాహ్నం12.30 వరకు నిర్వహించబడతాయి.కాని 3వ తేదీన జరిగే తెలుగు పేపర్, 10వ తేదీన జరిగే సైన్స్ పేపర్లు ఉదయం 9.30 గం.లనుండి 12.50గం.లవరకు నిర్వహించడం జరుగు తుందన్నారు. పరీక్ష మధ్యలో పేపర్ మార్పిడికి ఈ అదనపు సమ యం కేటాయించినట్లు తెలిపారు. విద్యార్థులు గమనించాలని కలెక్టర్ కోరారు.

## ఒక్క సిసి కెమెరా 100 మంది పోలీసులతో సమానం : డిసిఆర్‌బి డీఎస్పీ

**నారాయణపేట ప్రతినిధి,మార్చి 29 ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మక్తల్ మండల కేంద్రంలోని కేశవ నగర్ కాలనీలో సాయంత్రం 4 గం.లనుండి 6 గం.లవరకు సీఐ సీతయ్య ఆధ్వర్యంలో సిఐలు 2,ఎస్సై 7, ఎఎస్సై4, హెచ్‌సిలు 4, పిసిలు 40, స్పెషల్ పార్టీ సిబ్బంది మొత్తం 60 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో ఆకస్మిక కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. మొత్తం 7 పార్టీలుగా విడిపోయి తనిఖీలు నిర్వహించారు. 120 ఇళ్లను సోదాలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 40 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ నేరాల నిర్మూలనకు కమ్యూనిటీ కాంటాక్‌ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని,ప్రజల రక్షణ, ప్రజలకు భద్రత భావం, సెన్సాఫ్ సెక్యూరిటీ కల్పించడం గురించి ఎవరైనా కొత్త వ్యక్తులు గాని నేరస్తులుగాని వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుస్తుందని చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిఐలు సీతయ్య, శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సైలు పర్వతాలు,రాములు, విక్రమ్, విజయభాస్కర్, నరేందర్, స్పెషల్‌పార్టీ సిబ్బంది,పోలీసు,హెడ్ కానిస్టేబుల్,కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

## నంబర్ ప్లేటు లేని వాహనాలకు ఫైన్

### కేసులు నమోదు చేసిన ఎస్సై

**పెబ్బేరు,మార్చి 29 ప్రభాతవార్త:** నెంబర్ ప్లేటు లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి ఫైన్ విధించి కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై జగదీశ్ రెడ్డి తెలిపారు. బుధవారం పెబ్బేరు మండల కేంద్రంలో ఎస్పీ ఆదేశానుసారం ద్విచక్ర వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికీ 10వాహనాలను పట్టుకొని వాహన దారులకు ఫైన్ విధించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఇంకా స్పెషల్ డ్రైవ్ కొనసాగిస్తూనే ఉంటామని అన్నారు. వాహనదారులు తమ వాహనాలకు నెంబర్ ప్లేట్ ఉండే విధంగా చూసుకోవాలని ఆయన సూచించారు.

## కోదండరామస్వామి ఆలయంలో మూడవ రోజు ప్రత్యేక పూజలు

**ఇటిక్యాల,మార్చి 29 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బీచుపల్లి పుణ్యక్షేత్రంలో గల కోదండరామస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం మూడవ రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, తిరువారాధన, యాగశాల, ఆరాధనలు, మూలమంత్ర మూర్తి హోమాలు, ధన్వంతరి యాగం, స్వామి అమ్మవార్లకు నవ కలశ స్నపనం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం యాగశాల ఆరాధనలు, మూలమంత్ర మూర్తి హోమాలు, సుదర్శనయాగం, లఘు పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలను అర్చక బృందం ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఆలయ మేనేజర్ సురేంద్రరాజు తెలిపారు.

## సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- బీజేపీ మాజీ ఎంపీ రవీంద్రనాయక్



**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మార్చి 29, ప్రభాతవార్త:** టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ విషయంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని భారతీయ జనతా పార్టీ వరంగల్ మాజీ ఎంపీ రవీంద్రనాయక్ డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్కార్ నిర్లక్ష్యం వల్ల నిరుద్యోగుల ఆశలన్నీ నీటిపాలయ్యాయన్నారు. పేపర్ లీకేజీలో పెద్దలను వదిలి చిరు ఉద్యోగులను బాధ్యులుగా చూపిస్తూ కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నదన్నారు. వైద్య విద్యార్థిని ర్యాగింగ్ పేరుతో వేధింపులకు గురి చేసి చావుకు కారకులైనారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక సామాజిక వర్గం కోసం మెప్పుకోసం ఆత్మహత్యగా చిత్రీకరించి ప్రభుతం చేతులు దులుపుకుందన్నారు. ఈ వషయంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గిరిజనుల కోసం బడ్జెట్‌లో రూ.3200 కోట్లు కేటాయించి ఖర్చు చేసింది మాత్రం రూ.150 కోట్లేనని ఆరోపించారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పిమోసం చేశారని పేర్కొన్నారు. ప్రజలకు ఇప్పటికైనా కల్వకుంట్ల కుటుంబం మోసాలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణనాయక్, కోశాధ్యక్షుడు పాండు రంగారెడ్డి, పట్టణాధ్యక్షుడు నారాయణయాదవ్, నాయకులు గోపీనాయక్, సుబ్రహ్మణ్యం, భాస్కర్ నాయక్,వెంకటేశ్,సురేశ్, సంతోషం పాల్గొన్నారు.

## అనారోగ్యం బారిన పడిన మహిళకు టీఎమ్ఆర్ ఆర్థిక సాయం



**పెద్దమందడి,మార్చి 29 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మోజర్ల గ్రామానికి చెందిన జక్కని శాంతమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై వనపర్తి పట్టణంలోని ఒక ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. శాంతమ్మ ఆర్థిక పరిస్థితిని ఎంపీపీ మేఘారెడ్డి దృష్టికి స్థానిక టీఎమ్ ఆర్ యువసేన నాయకులు కొత్త కాపు రామకృష్ణ రెడ్డి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఎంపీపీ మేఘారెడ్డి రూ.5వేలు పంపించారు. బుధవారం శాంతమ్మ ఇంటికి వెళ్లి రామకృష్ణా రెడ్డి రూ.5వేలు అందజేశారు. ఈ సందర్భంగా బాదితురాలు ఎంపీపీ మేఘారెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

## ఈత చెట్ల నరికివేతపై జిల్లా అధికారికి ఫిర్యాదు

**పెబ్బేరు,మార్చి 29 ప్రభాతవార్త:** మండలంలోని గుమ్మడం గ్రామంలో ఈత చెట్లను తొలగించిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని జిల్లా గౌడ సంఘన అధ్యక్షుడు పలుస శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. వివిధ పత్రికల్లో వచ్చిన దానికి స్పందిస్తూ బుధవారం జిల్లా కమిటీ గుమ్మడం గ్రామాన్ని సందర్శించారు. గతంలో కూడా కంబలాపుర్ గ్రామంలో 6నెలల క్రితం దాదాపు 50 ఈత చెట్లను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఏదో క్రిమిసంహారక రసాయనాలతో చల్లి ఈత చెట్లను నాశనం చేయడం జరిగింది. ఆ ప్రదేశాన్ని తహసిల్దార్ సుజాత, ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఓంకార్ గ్రామాన్ని సందర్శించారు. ఈత చెట్లను తొలగించిన ప్రదేశానికి జిల్లా గౌడ సంఘం సభ్యులు గ్రామానికి వెళ్లి గ్రామానికి చెందిన రాఘవేందర్ గౌడ్, తో మాట్లాడుతూ ఈచెట్లను తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోని ఇలాంటి పనులు జిల్లాలో ఎక్కడ పునరావృతం కాకుండా ఎక్సైజ్ అధికారులు కానీ, పోలీసు అధికారులు కఠిన నిర్ణయాలు తీసుకోని వారిపై కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పలుస శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు అల్లాడి భగవంత్ గౌడ్, రవీందర్ గౌడ్, సంగమేశ్వర్ గౌడ్, వనపర్తి పట్టణ అధ్యక్షుడు వినోద్ గౌడ్, శ్రీరంగాపూర్ గౌడ సంఘం అధ్యక్షుడు ఎన్.వెంకటేష్ గౌడ్, పెబ్బేరు మండల అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్, గుమ్మడం సొసైటీ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ గౌడ్, రాఘవేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మార్చి 29, ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీపీవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. బుధవారం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి మాట్లాడుతూ వివిధ మండలాల్లో మూడు నుంచి అయిదు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. మేజర్ జీపీలు మహ్మదాబాద్,తాటికొండ, బాలానగర్ అలాగే జిల్లాలోని చిన్న పంచాయతీల్లో జీతాలు లేక కార్మికులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఈసందర్భంగా డీపీవో మాట్లాడుతూ బడ్జెట్ వస్తుందని, త్వరలోనే జీతాలు అందజేస్తామని తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతి అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పాండు, నాయకులు బ్రహ్మచారి, తిరుమలయ్య పాల్గొన్నారు.